నేటి కందం- నేటికి అందం

రేగించుచు నాగించుచు
సాగింపంబడుచు మిగుల సంతసమయమౌ
నాగోబా జాతరలో
నాగము కనిపించి ప్రజల నమ్మిక బెంచెన్ !!
(ఆదిలాబాద్ జిల్లా కెస్లాపూర్ లోని నాగోబా జాతర లో మహానాగు కనిపించి ప్రజలలో నాగోబా దేవత పై నమ్మకాన్ని పెంచింది.)
-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

చురక

ఫోనుల ట్యాపింగుల
పైన సిట్ దూకుడు
దర్యాప్తులు ఎన్నైనా
దగదెక్కని మూకుడు
సర్కారులో గత పెద్దలు
చేసినట్టి తప్పులు
తెలుతాయా వేస్తుంటే
తప్పించుకునే స్టెప్పులు
-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ శుక్రవారం 23-1-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:137 పేజీలు:6 వెల: రూ.1/-


# స్టీల్ ప్లాంట్‌లో పేలుడు..

## ఏడుగురు సజీవ దహనం, పలువురికి గాయాలు



రాయ్‌పూర్, జనవరి 22: స్టీల్ ప్లాంట్‌లో పేలుడు సంభవించింది. బొగ్గు కొలిమి అకస్మాత్తుగా పేలింది. ఈ ప్రమాదంలో ఏడుగురు కార్మికులు సజీవ దహనమయ్యారు. మరి కొందరు గాయపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని బలోడా బజార్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. గురువారం ఉదయం బకులాహిలోని రియల్ ఇస్పాట్ స్టీల్ ప్లాంట్‌లో దుర్ఘటన జరిగింది. బొగ్గు కొలిమి ప్రాంతం చుట్టూ కొంతమంది కార్మికులు శుభ్రపరిచే పనులు చేస్తుండగా అది పేలింది. మంటలు, దట్టంగా పొగలు చాలా దూరం వరకు కనిపించాయి.

కాగా, మండుతున్న బొగ్గు, అధిక వేడిమి వల్ల సుమారు ఏడుగురు కార్మికులు సజీవ దహనమయ్యారు. పది మందికిపైగా కార్మికులకు కాలిన గాయాలయ్యాయి. వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మరోవైపు పోలీసులు, అధికారులు ఆ స్టీల్ ప్లాంట్ వద్దకు చేరుకున్నారు. కోల్ ఫర్నేస్ పేలుడుపై దర్యాప్తు చేస్తున్నారు. ఆ ప్లాంట్‌లోని భద్రతా నిబంధనలను పరిశీలిస్తున్నారు.

# వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఎండీతో సీఎం రేవంత్ భేటీ




హైదరాబాద్ జనవరి 22: వరల్డ్ ఎకనామిక్ ఫోరంఎండీ జెరెమి జార్గాన్స్‌తో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. గురువారం దావోస్‌లో వరల్డ్ ఎనకామిక్ ఫోరంలో ఏర్పాటు చేసిన తెలంగాణ పెవిలియన్‌లో వీరి కీలక భేటీ జరిగింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఈ వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఫాలోఅప్ సదస్సు ఏర్పాటును సీఎం రేవంత్ ప్రతిపాదించారు. ఏటా జులైలో నిర్వహించే ఈ ఫాలోఅప్ ఫోరం కార్యక్రమంపై ఇరువురూ చర్చించారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ఈ సందర్భంగా డబ్ల్యూఈఎఫ్ ఎండీకి ముఖ్యమంత్రి వివరించారు.

అలాగే.. 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యంపై రోడ్ మ్యాప్‌ను కూడావీరు ప్రస్తావించారు. తెలంగాణ విజన్‌కు భాగస్వామ్యంగా నిలుస్తామని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి ఎండీ జెరెమి జార్గాన్స్ హామీ ఇచ్చారు. ఇక హైదరాబాద్‌లో ప్రభావవంతమైన మానవ వనరులపై ప్రశంసలు జల్లు కురిపించారు జార్గాన్స్. C4IR తెలంగాణ పురోగతిపై డబ్ల్యూఈఎఫ్ ఎండీ సంతృప్తి వ్యక్తం చేశారు. భారత్‌లో తొలి థీమాటిక్ C4IR గా తెలంగాణకు గుర్తింపు వచ్చినట్లు అయింది.

# జమ్మూకశ్మీర్‌లో లోయలో పడిపోయిన ఆర్మీ వాహనం

## - 10 మంది జవాన్లు మరణించగా, మరో 9 మందికి గాయాలు



జమ్మూకశ్మీర్ జనవరి 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: జమ్మూకశ్మీర్‌లోని దోడా జిల్లాలో ఆర్మీ వాహనం లోయలో పడిపోయింది. ఆ ఘటనలో 10 మంది జవాన్లు మరణించగా, మరో 9 మంది గాయపడ్డారు. బందేర్వా-చంబా హైవేపై ఉన్న ఖన్ని టాప్ ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. బుల్లెట్ ప్రూఫ్ ఆర్మీ వాహనంలో సుమారు 17 మంది సిబ్బంది ప్రయాణిస్తున్నారు .ఆర్మీ వాహనం హై ఆల్టిట్యూడ్ పోస్టు వద్దకు వెళ్తున్న సమయంలో ప్రమాదం జరిగింది. డ్రైవర్ వాహనాన్ని అదుపు చేయలేకపోయారు. సుమారు 200 ఫీట్ల లోతులో ఆ వెహికిల్ పడిపోయింది. ఆర్మీతో పాటు పోలీసులు సంయుక్తంగా సెర్చ్ ఆపరేషన్ మొదలుపెట్టారు. నలుగురు సైనికులు మృతిచెందినట్లు గుర్తించామన్నారు. గాయపడ్డవారిలో కొందర్ని ఉదంపూర్ మిలిటరీ ఆస్పత్రిలో చేర్పించారు.

# కృతజ్ఞతలు చెప్పడానికే ఈ ప్రాంతం వచ్చా...

## -ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క గిరిజన అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

జైనూర్, జనవరి 22: తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం రావాలని అది వచ్చేవరకు విశ్రమించమని పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా చర్యలు తీసుకుంటామని ప్రజల కు కృతజ్ఞతలు తెలుపడానికి వచ్చానని తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆయన ఈ రోజు కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోని జనగాం భూషిమట్ట గ్రామాలను సందర్శించి ప్రజలతో మాట్లాడారు.

2023 మార్చిలో నిర్వహించిన తన పాదయాత్రలో తన వెంట ప్రజలు పాదయాత్ర చేస్తూ ప్రజలు తెలిపిన సమస్యలపై ప్రత్యేక డైరీలో రాసుకొని పరిష్కరించే విధంగా బడ్జెట్లో నిధులు కేటాయిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ సంపదను తెలంగాణ ప్రజలకే పంచాలని లక్ష్యంతో ఈ ప్రజా పాలన ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు.

జిమ్గా ముషీగా ఓజ కులస్తులు ఇత్తడితో హస్తా కళల బొమ్మల తయారు చేసుకోవడానికి ఉపాధి కోసం సహాయం అడిగారని వారి కోసం బ్యాంకుల ద్వారా స్వయం ఉపాధి రుణాలు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నానని దశల వారీగా అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఆసిఫాబాద్ జైనూర్, ఉట్నూర్ రోడ్డు వెడల్పు కోసం నిధులు మంజూరు చేసి త్వరలో టెండర్లు వేస్తామని హామీ ఇచ్చారు.

స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాలు ఏడాదికి 20వేల కోట్ల చొప్పున



ఐదేళ్లకు 100 కోట్లు నిధులు ఇచ్చి మహిళలను కోటీశ్వరులు చేయాలని లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. జంగం సభా కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాల చెక్కును, గిరిజనులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. బూషిమెట్ట క్యాంపులో సద్గురు పులాజి బాబా ధ్యాన కేంద్రంలో సందర్శించి పూజలు చేశారు.

అనంతరం ఆ గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ సందర్శించినప్పుడు మహిళలు ఇంట్లోకి తీసుకువెళ్లి తనకు పండుగ సందర్భంగా స్వీట్ రొట్టె తినిపించారని ఈ గ్రామ మహిళలు తన ఇంటికి రావాలని ఆయన ఆహ్వానించారు. గ్రామస్తులు ఈ కార్యక్రమాల్లో గిరిజనుల వ్యవసాయ అభివృద్ధికి ఇందిరా జల వికాసం ద్వారా సౌర సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటు చేయడం జరుగుతుందని విద్యుత్ సమస్యలు పరిష్కరించడానికి 108 వాహనం తరాహాలో 1912 వాహనాన్ని ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరిస్తామని ఏ సమస్యఉన్న ఆ నెంబర్ కు కాల్ చేయాలని కోరారు. కార్పొరేట్ స్థాయిలో నిరుపే దలకు విద్య అందించేందుకు నియోజకవర్గానికి ఒకటి చొప్పున 200 కోట్లతో న్యూ యంగ్ ఇండియా ఇంటర్నే షనల్ స్కూల్ లను ప్రారంభిం చడం జరుగుతుందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో అదిలాబాద్ ఎమ్మెల్సీ దండేవిటల్, గిరిజన ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్ డీసీసీ సహకార రాష్ట్ర చైర్మన్ కోట్నాక్ తిరుపతి, ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, నియోజకవర్గ ఇన్చార్జి శ్యాం నాయక్, మాజీ డీసీసీ విశ్వప్రసాద్, జైనూర్ మార్కెట్ కమిటీ కుడి మేత విశ్వనాథ్ రావు, ఆత్మ చైర్మన్ రాథోడ్ రమేష్, పట్నాపూర్ సిద్దేశ్వర సంస్థ అధ్యక్షుడు ఇంగ్లె కేశవ్ దాదా, కార్యదర్శి దుర్రె సుభాష్, రాష్ట్ర నాయకులు గణేష్ రాథోడ్, ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె హరిత, అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి, ఆసిఫాబాద్ ఎస్పీ నితిక పంత్ అదనపు ఎస్పి చిత్తరంజన్, డీఎఫ్ఓ నీరజ్ కుమార్ ఎంపీ డీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, జంగాం సర్పంచ్ పేందూర్ అనసూయ అర్జున్, ఉప సర్పంచ్ సజిత్, ఆసిఫాబాద్ డ్వామా పిడి బానోద్ దత్తరం, డీపీఓ బిక్షపతి గౌడ్, జిల్లా అధికారులు ఎంపీడీవో సుధాకర్ రెడ్డి తాసిల్దార్ ఆడబీర్వావ్, ఎంపీ ఓ ముఖ్య శశి కుమార్, ఏపీఎం శ్రీకాంత్, సిఐ రమేష్, అధికారులు ఉద్యోగులు నాయకులు, పాల్గొన్నారు.

# మావోయిస్టులకు మారో ఎదురుదెబ్బ..

## ఎదురు కాల్పుల్లో 10 మంది మావోస్టులు మృతి

హైదరాబాద్ జనవరి 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: మావోయిస్టులకు మారో ఎదురుదెబ్బ తగిలింది. జార్ఖండ్‌లో రాష్ట్రం పశ్చిమ సింగ్భూం జిల్లాలో మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో 10 మంది మావోస్టులు మృతి చెందారు. కాల్పులు కొనసాగుతున్నాయని ఆపరేషన్ ఐజీ మైఖేల్ రాజ్ వెల్లడించారు. అడవుల్లో మావోయిస్టులు సంచరిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు భద్రతా దళాలు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో వారికి మావోయిస్టులు తారసపడి జవాన్లపైకి కాల్పులు జరిపారు. వెంటనే అప్రమత్తమైన బలగాలు ఎదురుకాల్పులకు దిగడంతో ఇరువర్గాల మధ్య కాల్పులు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు.

# భోజ్‌శాల-కమల్ మౌలా మసీదులో హిందువులు, ముస్లింలు కలిసి పూజలు, ప్రార్థనలు

## -సుప్రీంకోర్టు ఇవాళ కీలక తీర్పు

దార్(మధ్యప్రదేశ్) జనవరి 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: సుప్రీంకోర్టు ఇవాళ కీలక తీర్పు ఇచ్చింది. మధ్యప్రదేశ్‌లోని దార్ జిల్లాలో ఉన్న భోజ్‌శాల-కమల్ మౌలా మసీదులో హిందువులు, ముస్లింలు కలిసి పూజలు, ప్రార్థనలు చేసుకోవచ్చు అని పేర్కొన్నది. శుక్రవారం వసంత పంచమి సందర్భంగా ఇవాళ కోర్టు ఈ తీర్పును వెలువరించింది. వసంత పంచమి రోజున సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు హిందువులు పూజలు చేసుకోవచ్చు అని, అలాగే ఆ రోజున మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల మధ్య ముస్లింలు ప్రార్థనలు చేసుకోవచ్చు అని సుప్రీం పేర్కొన్నది. అయితే నమాజ్‌కు వచ్చే ముస్లింలు జిల్లా యాజమాన్యం వద్ద తమ పేర్లను నమోదు చేయాల్సి ఉంటుందని కోర్టు ఆదేశించింది. వసంత పంచమి సందర్భంగా శుక్రవారం భోజ్‌శాలలో సరస్వతీదేవి పూజ నిర్వహించనున్నారు. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, విపుల్ పాంచోలితో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది. రెండు వర్గాల ప్రజలు ఒకరికి ఒకరు సహకరించుకోవాలని, అలాగే రాష్ట్ర, జిల్లా ప్రభుత్వ యాజమాన్యానికి సహకరించాలని కోర్టు పేర్కొన్నది. వసంత పంచమి సందర్భంగా దార్‌లో సుమారు 8 వేల మంది పోలీసుల్ని మోహరించారు. అవాంఛిత సంఘటనలు జరగకుండా ఉండేందుకు చర్యలు చేపడుతున్నారు. విష్ణు శంకర్ జైన్ అనే వ్యక్తి పిల్ దాఖలు చేశారు. 2003లోనే ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా ముస్లింల ప్రార్థనల విషయంలో కీలక ఆదేశాలు ఇచ్చింది. శుక్రవారం రోజున మధ్యాహ్నం 1 నుంచి 3 మధ్య ప్రార్థనలు చేసుకోవడానికి వీలు కల్పించింది. వసంత పంచమి రోజున హిందువులు పూజలు చేసుకోవచ్చు అని, మంగళవారం కూడా పూర్తి స్థాయిలో పూజలు చేసుకునేందుకు ఏఎస్ఐ అనుమతి ఇచ్చింది. అయితే ఆనాటి నుంచి ఇప్పటి వరకు మూడు సార్లు మాత్రమే వసంత పంచమి-శుక్రవారం కలిసి వచ్చాయని, 2006..2013.. 2016 సంవత్సరాల్లో ఇలాంటి సందర్భం ఎదురైంది.


# వీధి కుక్కలను విషప్రయోగంతో చంపిన ఘటనలో బాధ్యులపై కఠిన చర్యలు

## -పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం
## -రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీలకు మార్గదర్శకాలు జారీ



హైదరాబాద్ జనవరి 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీలకు మార్గదర్శకాలు జారీ చేశారు. కొన్ని గ్రామ పంచాయతీల్లో వీధి కుక్కలను విషప్రయోగంతో చంపిన ఘటనలో బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని.. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని గ్రామ పంచాయతీలకు ఇప్పటికే స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసినట్టు మంత్రి సీతక్క తెలిపారు. వీధి కుక్కల బెడద ఉందన్న నెపంతో అమానుషంగా కుక్కలను చంపడం చట్టవిరుద్ధం మాత్రమే కాదని, మానవత్వానికి పూర్తిగా విరుద్ధమన్నారు. ఇలాంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని సీతక్క పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా యాచారం గ్రామంలో వంద కుక్కలకు విషపూరిత ఇంజక్షన్లు ఇచ్చి చంపిన విషయం తెలిసిందే. గతంలో కామారెడ్డి జిల్లాలోని మాచారెడ్డి మండల పరిధిలోని గ్రామాలలో 600 కుక్కలకు విషం పెట్టి చంపారు. యాచారం, కామారెడ్డి జిల్లాలో ఘటనలో సర్పంచ్, కార్యదర్శి, వార్డు మెంబర్‌పై జంతువులపై క్రూరత్వ నివారణ చట్టం కింద కేసు నమోదు చేసిన విషయం విధితమే. వీధి కుక్కల బెడద ప్రజలకు ఇబ్బందిగా ఉన్న మాట వాస్తవమేనని, వాటిని చంపడం చట్టరీత్యా నేరం మాత్రమే కాదు అని పర్యావరణ సమతుల్యతకు కూడా ముప్పు వాటిల్లుతుంది.

# స్పోర్ట్స్ పవర్ హౌస్‌గా భారత్.. ఇదే ప్రధాని విజన్: గవర్నర్ జిష్ణుదేవ్



హైదరాబాద్, జనవరి 22: ప్రధాని నరేంద్ర మోదీ.. దేశాన్ని స్పోర్ట్స్ పవర్ హౌస్‌గా మార్చాలని విజన్‌గా పెట్టుకున్నారని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. గురువారం సంసద్ ఖేల్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఎల్బీ స్టేడియంలో క్రికెట్ ఆడారు గవర్నర్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటలు కేవలం మెడల్స్ కోసమే కాదని.. దేశ ఆత్మవిశ్వాసాన్ని ప్రపంచానికి చూపేందుకు స్పోర్ట్స్ ఒక శక్తిమంతమైన మార్గమని గవర్నర్ వివరించారు. స్వచ్ఛ భారత్ ఒక ఉద్యమంగా మారిందని, యోగాను ప్రపంచ వ్యాప్తంగా తీసుకెళ్లినట్లు తెలిపారాయన.

ప్రధాని మోదీ పాలసీలను ప్రజా ఉద్యమాలుగా మార్చడంలో ఆయన నాయకత్వ సామర్థ్యం అద్భుతమైనదని కొనియాడారు జిష్ణుదేవ్ వర్మ. ఈశాన్య రాష్ట్రాల నుంచి అన్ని మెడల్స్ వస్తాయని ఊహించలేదని, త్రిపుర నుంచి ఒలింపిక్స్‌కు పోటీ పడుతున్నారని సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణలోనూ మంత్రి ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. క్రీడాకారులు, క్రీడా ప్రేమికులు ఇంత స్థాయిలో పాల్గొనడం సంతోషకరమని గవర్నర్ అభివర్ణించారు.

క్రీడలు ప్రజలకు ఎన్నో నేర్పుతాయన్నారు. ఇది వికసిత్ భారత్ కోసం వేసే ముందడుగు అని.. 'స్వస్థ్ భారత్, శ్రేష్ఠ భారత్'కు ఇది తొలి అడుగు అని గవర్నర్ ఉద్ఘాటించారు.

# అరుదైన శక్తివంతమైన యాదృచ్ఛికానికి సాక్ష్యమివ్వబోతోన్నభారత్

హైదరాబాద్ జనవరి 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );2026 జనవరి 26న భారతదేశం ఒక అరుదైన మరియు శక్తివంతమైన యాదృచ్ఛికానికి సాక్ష్యమివ్వబోతోంది.

జనవరి 26 సంవత్సరంలో సరిగ్గా 26వ రోజు.. గణతంత్ర రాజ్యంగా 76 ఏళ్లు పూర్తి (1950-2026)ఇది 26:26?26 అనే ఒక అరుదైన సంకేతాత్మక క్షణం. స్వాతంత్ర్యం నుండి రాజ్యాంగం వరకు, పోరాటం నుండి శక్తివంతమైన దేశంగా ఎదిగే వరకు, మరియు గొప్ప ఆశయాల నుండి విలువల వరకు భారతదేశం సాగించిన ప్రయాణాన్ని ఇది ప్రతిబింబిస్తుంది. ఐక్యత, ప్రజాస్వామ్యం మరియు చట్టం అనే బలమైన పునాదులపై నిర్మితమైన మన దేశం... నేడు గర్వంతో, దృఢమైన లక్ష్యంతో ప్రపంచం ముందు తలఎత్తుకుని నిలబడింది. అదేఈ రోజు ప్రత్యేకత. అనూహ్యం ఙ చారిత్రాత్మకం అని చెప్పవచ్చు.


సాధన సాహితీ స్రవంతి
మరియు
నందనవనం సాహితీ సమితి
సంయుక్త ఆధ్వర్యంలో



ప్రముఖ ఆర్థికవేత్త & సాహితీవేత్త
డా. కర్నాటి లింగయ్య గారి
సాహిత్య స్వర్ణోత్సవ సందర్భంగా వారి
నా జీవన యాత్ర (ఓ క్రియాశీలి ఆత్మకథ)
గ్రంథావిష్కరణ

ముఖ్య అతిథి, గ్రంథావిష్కర్త : డా. కె.వి. రమణాచారి గారు, ఐఏఎస్(రి)
తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారులు
అధ్యక్షులు : శ్రీ బైసా దేవదాసు గారు
'నేటి నిజం' పత్రిక సంపాదకులు
సభా ప్రారంభం : డా. ఏనుగు నరసింహారెడ్డి గారు
తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ సంచాలకులు
విశిష్ట అతిథులు : ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి గారు
పూర్వ తెలుగుశాఖాధిపతి, ఉస్మానియా విశ్వవిద్యాలయం
ఆచార్య మసన చెన్నప్ప గారు
పూర్వ తెలుగుశాఖాధిపతి, ఉస్మానియా విశ్వవిద్యాలయం
ఆత్మీయ అతిథి : డా. టి. గౌరీశంకర్ గారు
విశ్రాంత రిజిస్ట్రార్, తెలుగు విశ్వవిద్యాలయం
గ్రంథ సమీక్ష : డా. రాధశ్రీ గారు
విశ్రాంత ఏజీఎం, సిండికేట్ బ్యాంక్

తేది: 25-01-2026 ఆదివారం ఉదయం 10 గంటలకు
వేదిక : డా. కె.వి. రమణాచారి, ఐఏఎస్(రి) వారి క్యాంప్ ఆఫీస్, నఫీస్ రెసిడెన్సీ, శాంతినగర్ మెయిన్ రోడ్, మహావీర్ హాస్పిటల్ ఎదురు వీధి, మాసబ్ ట్యాంక్, హైదరాబాదు

సాహితీ మిత్రులకు ఇదే మా సాదర ఆహ్వానం

కర్నాటి ప్రసాద్
ప్రధాన కార్యదర్శి, నందనవనం సాహితీ సమితి

సాధన నరసింహాచార్య
అధ్యక్షులు, సాధన సాహితీ స్రవంతి

# సరస్వతీ మాత పూజలకు వేదిక వసంత పంచమి

## (23 జనవరి "వసంత పంచమి" పర్వదినం శుభ సందర్భంగా)

పురాణాల వివరణ ప్రకారం సరస్వతీ దేవి పుట్టిన రోజును "వసంత పంచమి" పండుగను ఘనంగా జరుపుకుంటున్నాం. హిందూ పంచాంగం ప్రకారం, ప్రతి ఏడాది మాఘ మాసంలో శుక్లపక్ష శుద్ధ పంచమి రోజున వసంత పంచమిని నిర్వహించడం ఆనవాయితీగా మారింది. సరస్వతీ మాతను కళలు, విజ్ఞానం, సంగీతాల దేవతగా పరిగణిస్తారు. విద్యా మాత ఒక చేతిలో సంగీత వీణ, మరో చేతిలో విజ్ఞాన పుస్తకం, 3వ చేతిలో మాల, నాలుగవ చేయి ఆశీర్వాదం ఇచ్చే భంగిమలో చూడముచ్చటగా, అద్వితీయ భావనను కలిగించే దివ్య రూపంగా ఉంటుంది. వసంత పంచమి నాడు పెద్ద ఎత్తున భక్తులు నదులు, త్రివేణి సంగమ క్షేత్రాల్లో పుణ్య స్నానాలు, సరస్వతీ మాత పూజలు చేసి తరిస్తారు.

### వసంత పంచమి పుణ్య గడియలు:

ఈ ఏడాది వసంత పంచమి తిథి 23 జనవరి శుక్రవారం ఉదయం 7:15 నుంచి మధ్యాహ్నం 12:33 గంటల వరకు పుణ్య కాలం ఉండడంతో పూజలు చేసుకోవడానికి దివ్యంగా ఉంటుందని పండితులు చెబుతున్నారు. ప్రకృతి అందం, నూతన శక్తి ప్రసాదించే వేడుకగా వసంత పంచమిని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంటాం. ఈ పర్వదిన గడియల్లో కళలకు దేవత అయిన సరస్వతీ దేవిని ప్రత్యేకంగా భక్తిశ్రద్ధలతో పూజించడం జరుగుతుంది. చదువుల తల్లి సరస్వతీ దేవి ఆలయాలతో పాటు విద్యాలయాల్లో కూడా ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పిల్లలకు అక్షరాభ్యాసాలు చేయించడంతో పాటు మనసుకు ఏకాగ్రత, గృహంలో సానుకూల శక్తుల ప్రవాహం, అనంతమైన వైవాహిక జీవితం, కుటుంబ పురోగతి సిద్ధిస్తుందని మన నమ్మకం.

### పూజా విధానం - నియమ నిబంధనలు:

ఇదే రోజు బాసరలో వ్యాసమహర్షి ఇసుకతో చేయబడిన సరస్వతీ దేవిని ప్రతిష్టించిన రోజుగా కూడా నమ్ముతారు. వసంత పంచమి రోజు ఉషోదయానికి పూర్వమే నిద్ర లేచి తలస్నానం చేసి, శుభ్రమైన తెలుపు లేదా పసుపు వర్ణపు వస్త్రాలు ధరించి, విఘ్నేశ్వరుడిని పూజించి, అక్షర అధిదేవత అమ్మవారి మంత్రాలు పఠిస్తూ, సరస్వతీ అమ్మవారి ఫోటో లేదా విగ్రహానికి పసుపు రంగులో ఉండే పువ్వులు, అక్షింతలు, చందనం, ధూపం, దీపం, పసుపు రంగు మిఠాయిలను నైవేద్యాలుగా సమర్పిస్తారు. పురాణాల ప్రకారం, బ్రహ్మదేవుడి నోట్లోంచి సరస్వతీ మాత ఆవిర్భవించి, ఈ లోకానికి ఒక శబ్దాన్ని ఇచ్చిందని వర్ణించబడింది. ఆహ్లాదకరమైన వసంత రుతువు ప్రారంభంతో సానుకూల శక్తులు ప్రవహిస్తూ మేలును చేస్తాయని నమ్మకం. వసంత పంచమి పర్వదినం రోజు సాత్విక ఆహారం తీసుకోవడం, ఉపవాస దీక్షలు పాటించడం ఉత్తమం.

సరస్వతీ మాతకు భక్తిశ్రద్ధలతో పూజలు చేయుట ద్వారా మన మన వృత్తిల్లో ఎదురయ్యే అడ్డంకులను తొలగించి జ్ఞానం, మధురమైన వాక్కును ప్రసాధించాలని కోరుకుందాం. వాక్శుద్ధి, విజ్ఞాన వివేకాలు, తెలివి, సృజనాత్మకత అందించే సరస్వతీ మాత కరుణాకటాక్షాలు అందరిపై ఉండాలని కోరుకుందాం.

ప్రణోదేవీ సరస్వతీ
వాజేభిర్వాజినీ వత్స ధీనామ విత్ర్యవతు
వసంత పంచమి పర్వదిన శుభాకాంక్షలు



- ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# ఈ దేశం ఆత్మ, భారత్ ధర్మం శ్రీరాముడు: ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, జనవరి 22:భారత ప్రభుత్వ మాజీ కార్యదర్శి శ్రీ సురేంద్ర కుమార్ పచౌరి రచించిన 'చాలీస్ ఆఫ్ అంబ్రోసియా: రామ్ జన్మభూమి ఛాలెంజ్ అండ్ రెస్పాన్స్' పుస్తకాన్ని భారత ఉపరాష్ట్రపతి శ్రీ సీ.పీ. రాధాకృష్ణన్ నేడు ఢిల్లీలోని ఉపరాష్ట్రపతి భవనంలో విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీరాముని జన్మస్థలాన్ని తిరిగి పొందేందుకు జరిగిన శతాబ్దాల నాటి పోరాటాన్ని ఈ పుస్తకం చక్కగా పొందుపరిచిందన్నారు. చారిత్రక కథనాన్ని సమతుల్యత, సానుభూతి, పాండిత్యంతో కూడిన సంయమనంతో ఈ పుస్తకం ప్రదర్శించిందని పేర్కొన్నారు.

అయోధ్యలో శ్రీరామ మందిర నిర్మాణం భారతదేశ నాగరికత ప్రయాణంలో ఒక నిర్ణయాత్మక క్షణానికి ప్రతీక అన్న ఉపరాష్ట్రపతి.. ఈ సందర్భంగా విశ్వాసం, చరిత్ర, చట్టం, ప్రజాస్వామ్యం హుందాగా ఒకచోట కలిశాయని అన్నారు. ఇతర ప్రాంతాల్లో ఎక్కడైనా వేల సంఖ్యలో ఆలయాలు నిర్మించినప్పటికీ శ్రీ రాముని జన్మస్థలంలో నిర్మించిన ఆలయ విశిష్టతతో ఏదీ సమానం కాదని ఆయన వ్యాఖ్యానించారు.

శ్రీరాముడు ఈ దేశం ఆత్మ, భారత ధర్మానికి ప్రాణం అని శ్రీ సీ.పీ. రాధాకృష్ణన్ అన్నారు. ధర్మం ఎన్నటికీ ఓడిపోదని, సత్యమే ఎప్పుడూ జయిస్తుందని ఆయన ఉద్ఘాటించారు. మహాత్మా గాంధీ కన్న 'రామరాజ్యం' కలను ప్రస్తావిస్తూ.. ఇది అందరికీ న్యాయం, సమానత్వం అందిస్తూ గౌరవానికి చిహ్నంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

శ్రీరాముని జన్మస్థలంలో మందిరాన్ని నిర్మించేందుకు ఇంత సుదీర్ఘ ప్రక్రియ అవసరమవటం బాధాకరమన్న ఉపరాష్ట్రపతి శ్రీ సీ.పీ. రాధాకృష్ణన్.. ఇలాంటి పరిస్థితి ప్రపంచంలోని మరే ఇతర దేశంలోనైనా ఊహించలేమని అన్నారు. మొత్తం దేశం విశ్వాసం ఉన్నప్పటికీ సరైన చట్టపరమైన ప్రక్రియ, ఆధారాల తర్వాత మాత్రమే భూమి కేటాయింపు జరిగిందని.. ఇది భారత ప్రజాస్వామ్య బలాన్ని తెలియజేస్తోందని ఆయన పేర్కొన్నారు. అందుకే భారత్‌ను సగర్వంగా 'ప్రజాస్వామ్యానికి మాత' అని పిలుస్తారని ఆయన అన్నారు.

2019 సుప్రీంకోర్టు తీర్పును ప్రస్తావిస్తూ ఇది కోట్లమంది భారతీయుల చిరకాల స్వప్నాలు, ఆకాంక్షలను నెరవేర్చిందని.. భారత చరిత్రలో ఒక మలుపుగా నిలిచిందని ఉపరాష్ట్రపతి శ్రీ సీ.పీ. రాధాకృష్ణన్ అన్నారు. రామమందిర నిర్మాణం భారతీయుల ఆత్మగౌరవాన్ని పునరుద్ధరించిందని ఆయన పేర్కొన్నారు.

చరిత్ర రాయడం అత్యంత క్లిష్టమైన సాహిత్య ప్రక్రియలలో ఒకటన్న ఉపరాష్ట్రపతి.. దీనికి భావోద్వేగ సమతుల్యత, సత్యం పట్ల నిబద్ధత అవసరమని అభిప్రాయపడ్డారు. ఎటువంటి సంచలనం లేదా వక్రీకరణలు లేకుండా రామజన్మభూమి ఉద్యమ సారాంశాన్ని రచయిత శ్రీ పచౌరి విజయవంతంగా చెప్పారని ఆయన కొనియాడారు.

చారిత్రక ఆధారాల నమోదులో ఉన్న లోపాలు న్యాయం కోసం సుదీర్ఘ పోరాటం చేయడానికి దారితీశాయని ఉపరాష్ట్రపతి అన్నారు. ఈ చారిత్రక ఉద్యమానికి సంబంధించిన ఆధునిక దశను ఈ పుస్తకం పొందుపరచటం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. దీని ద్వారా జాతీయ ఆత్మగౌరవాన్ని పునరుద్ధరించడానికి చేసిన త్యాగాలు, పోరాటాల గురించి భవిష్యత్తు తరాలకు అవగాహన ఉంటుందని ఆయన అన్నారు. పుస్తకంలో ఉటంకించిన ఏఎస్ఐ నివేదికలోని అంశాలను ప్రస్తావిస్తూ.. అక్కడ అంతకుముందే ఒక నిర్మాణం ఉందనడానికి బలమైన ఆధారాలు ఉన్నాయన్నారు. న్యాయస్థానం నిర్ణయం తీసుకోవడంలో ఈ పురావస్తు ఆధారాలు ఎంత కీలకంగా మారాయో ఉపరాష్ట్రపతి వివరించారు.

తీర్పు వెలువడిన తర్వాత ప్రజల స్పందన అద్భుతంగా ఉందన్న ఉపరాష్ట్రపతి.. శ్రీ రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నేతృత్వంలో జరిగిన దేశవ్యాప్త విరాళాల సేకరణ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తుల నుంచి రామమందిర నిర్మాణం కోసం రూ. 3,000 కోట్ల కంటే ఎక్కువ నిధులు సేకరించడాన్ని ఆయన గుర్తు చేశారు. 1990ల లో తన తల్లి 'శిలా పూజ'లో పాల్గొన్న వ్యక్తిగత జ్ఞాపకాలను కూడా ఆయన పంచుకున్నారు.

ఈ పవిత్ర స్థల పునరుద్ధరణను భారత పరిపక్వ ప్రజాస్వామ్యం, సాంస్కృతిక విశ్వాసానికి ప్రతీకగా నిలిచేలా చేసిన ఘనత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వానికే దక్కుతుందని శ్రీ సీ.పీ. రాధాకృష్ణన్ పేర్కొన్నారు. 2025 నవంబర్ 25న శ్రీ రామజన్మభూమి మందిరంలో జరిగిన చారిత్రక ధ్వజారోహణ కార్యక్రమాన్ని ఉపరాష్ట్రపతి గుర్తుచేశారు. యావత్ దేశం వీక్షించిన అత్యంత భావోద్వేగపూరితమైన క్షణంగా దీనిని ఆయన అభివర్ణించారు.

శ్రీరాముని విశ్వజనీన ఆకర్షణ గురించి మాట్లాడిన ఉపరాష్ట్రపతి.. రామునిపై ఉన్న విశ్వాసం భౌగోళిక సరిహద్దులకు అతీతమైనదని.. ఇది అయోధ్య - రామేశ్వరంలోనే కాకుండా ఫిజీ, కాంబోడియాలోని అంగ్‌కోర్ వాట్ వంటి ప్రదేశాలలో కూడా కనిపిస్తోందని అన్నారు.

నిజమైన గొప్పతనం రాజ్యాలను ఏలడంలో కాదనీ, సద్గుణంతో ప్రజల హృదయాలను గెలుచుకోవడంలోనే ఉంటుందన్న విషయాన్ని శ్రీరాముని జీవితం, ఆదర్శాలు మానవాళికి నేర్పుతున్నాయని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. ఈ శాశ్వతమైన ఆదర్శాలను ప్రతీ ఒక్కరు సొంత జీవితాల్లో అనుసరించడానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

చేసిన కృషికి గాను శ్రీ సురేంద్ర కుమార్ పచౌరిని శ్రీ సీ.పీ. రాధాకృష్ణన్ అభినందించారు. ఈ పుస్తకం విస్తృతంగా పాఠకులకు చేరువవుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తూ ప్రసంగాన్ని ముగించారు.

ఈ కార్యక్రమంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నిర్మాణ కమిటీ చైర్మన్, ప్రధానమంత్రి మ్యూజియం - లైబ్రరీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ చైర్మన్ శ్రీ నృపేంద్ర మిశ్రా భారత మాజీ కాంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ శ్రీ వినోద్ రాయ్.. యూపీఎస్సీ మాజీ చైర్మన్ శ్రీ దీపక్ గుప్త.. భారత ఉపరాష్ట్రపతి కార్యదర్శి శ్రీ అమిత్ ఖరే.. హర్ ఆనంద్ పబ్లికేషన్స్ ప్రతినిధి శ్రీ ఆశిష్ గోసైన్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## రామ కథ మ్యూజియానికి కానుకగా 233 ఏళ్ల నాటి వాల్మీకి రామాయణం

న్యూఢిల్లీ, జనవరి 22:ఒక చరిత్రాత్మక సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా 233 సంవత్సరాల నాటి అరుదైన వాల్మీకి రామాయణం (తత్త్వదీపికాటికతో కూడినది) సంస్కృత తాళపత్ర గ్రంథాన్ని కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ శ్రీనివాస వరఖేడి... తీన్ మూర్తిలోని ప్రధానమంత్రుల మ్యూజియం, లైబ్రరీ కార్యనిర్వాహక మండలి చైర్మన్ శ్రీ నృపేంద్ర మిశ్రాకు అందజేశారు.

ఆదికవి వాల్మీకి రచించిన, మహేశ్వర తీర్థుని శాస్త్రీయ వ్యాఖ్యానంతో కూడిన ఈ తాళపత్ర గ్రంథం సంస్కృత భాషలో (దేవనాగరి లిపిలో) రాసినది. ఇది విక్రమ సంవత్సరం 1849 (క్రీ.శ. 1792) నాటి చరిత్రక ప్రాముఖ్యం గల రచన. అరుదైన, భద్రపరచిన రామాయణ గ్రంథ సంప్రదాయాన్ని ఇది సూచిస్తుంది. ఈ సంకలనం ఇతిహాసపు కథనం, తాత్విక లోతును ప్రతిబింబించే బాలకాండ, అరణ్యకాండ, కిష్కింధకాండ, సుందరకాండ, యుద్ధకాండ అనే ఐదు ప్రధాన కాండాలను కలిగి ఉంది.

గతంలో న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌కు తాత్కాలికంగా అప్పగించిన ఈ చేతిరాత ప్రతిని, ఇప్పుడు ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో ఉన్న అంతర్జాతీయ రామ కథా సంగ్రహాలయానికి శాశ్వత కానుకగా అందజేశారు. ఈ ముఖ్యమైన చర్య... రామాయణ వారసత్వానికి ప్రపంచ కేంద్రంగా మ్యూజియం అభివృద్ధి చెందటానికి తోడ్పడుతుంది. తద్వారా అనేక మంది ప్రజలకు అందుబాటులోకి రావడంతో పాటుగా దాని పరిరక్షణనూ ఇది నిర్ధారిస్తుంది.

# చట్టసభల పనితీరులో ప్రమాణాలు నెలకొల్పాల్సిన ఆవశ్యకతను పునరుద్ఘాటించిన లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా

న్యూఢిల్లీ, జనవరి 22:రవనీయ లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా ప్లీనరీ చర్చలకు హాజరు కాగా, గౌరవనీయ రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ శ్రీ హరివంశ్ చర్చల సమన్వయకర్తగా వ్యవహరించారు.

ఈ సందర్భంగా స్పీకర్ శ్రీ ఓం బిర్లా ప్రసంగిస్తూ- దేశంలోని వివిధ రాష్ట్రాల శాసనసభల్లో అనుసరిస్తున్న ఉత్తమ పద్ధతులను ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ కార్యకలాపాలతో సమన్వయం చేసే దిశగా రాష్ట్ర శాసనసభ స్పీకర్ శ్రీ సతీష్ మహానా కృషిని ప్రశంసించారు. అలాగే శాసనసభ్యుల విద్యార్హతలతోపాటు వారి వృత్తిగత అనుభవాలను గుర్తించి, వాటిని అర్థవంతంగా వినియోగించడంలో శ్రీ మహానా చొరవను కూడా కొనియాడారు.

మునుపటి 'ఏఐపీఓసీ'లలో కీలకాంశాలపై చర్చలను గుర్తుచేస్తూ- సామర్థ్యం, ఆవిష్కరణాత్మకత, సాంకేతికతల వినియోగం వంటి ప్రమాణాలను నెలకొల్పడంలో రాష్ట్ర శాసనసభల మధ్య ఆరోగ్యకర పోటీ ఎంతయినా అవసరమని శ్రీ బిర్లా స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో డెహ్రాడూన్‌లో 2019నాటి 'ఏఐపీఓసీ'లో చర్చలను ఆయన ప్రస్తావించారు. రాష్ట్ర శాసనసభల సామర్థ్యం, పనితీరు మెరుగుపై చిరకాలం నుంచీ తన మదిలో మెదలుతున్న ఆలోచనలను పునరుద్ఘాటించారు. ఈ అంశాలపై ఒక కమిటీని ఏర్పాటు చేశామని, అది దేశంలోని శాసనసభల విధివిధానాల ప్రామాణీకరణ సంబంధిత విషయాలను పరిశీలిస్తున్నదని తెలిపారు.

శాసనసభల సామర్థ్యం పెంపులో కృత్రిమ మేధ (ఏఐ) పాత్రను రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ శ్రీ హరివంశ్ తన ప్రసంగంలో ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని సముచితం, విశ్వసనీయంగా రూపొందించేందుకు చేపట్టాల్సిన వివిధ చర్యల గురించి కూడా ఆయన వివరించారు. పార్లమెంటులో 'ఏఐ' ఆచరణాత్మక వినియోగం-అమలు సంబంధిత వివిధ పద్ధతులను ఉటంకిస్తూ, పార్లమెంటుతో పాటు రాష్ట్ర శాసనసభల మధ్య మరింత సమన్వయం అవసరమని స్పష్టం చేశారు. తద్వారా శాసనసభల సంస్థాగత పరిజ్ఞానాన్ని పార్లమెంటు-శాసనసభలు రెండింటా సమర్థంగా ఉపయోగించుకునే వీలుంటుందని చెప్పారు.

మూడు రోజుల ఈ సదస్సు రేపటితో సమాప్తం కానున్న నేపథ్యంలో గౌరవనీయ లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా ముగింపు ప్రసంగం చేస్తారు. ఈ కార్యక్రమానికి హాజరవుతున్న ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ యోగి ఆదిత్యనాథ్ కూడా సదస్సునుద్దేశించి ప్రసంగిస్తారు.

# ఎస్. జానకి ఇంటిలో విషాదం..

## -ఆమె ఏకైక కుమారుడు మృతి

హైదరాబాద్, జనవరి 22: సినీ పరిశ్రమలో లెజెండ్రీ గాయని ఎస్. జానకి కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆమె ఏకైక కుమారుడు మురళీకృష్ణ (65) ఆ రోజు ఉదయం తుదిశ్వాస విడిచారు. కొంతకాలంగా ఆయన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ రోజు కన్నుమూసినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. మురళీకృష్ణ కేవలం జానకి కుమారుడిగానే కాకుండా, కళారంగంలో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన భరతనాట్యంలో మంచి ప్రావీణ్యం ఉన్న వ్యక్తి. తెలుగు, మలయాళ చిత్రాల్లో నటుడిగానూ రాణించారు. తెలుగులో 'వినాయకుడు', 'మల్లెపువ్వు' వంటి సినిమాల్లో నటించిన ఆయన, మలయాళ చిత్రం 'కూలింగ్ గ్లాస్' కు రచయితగానూ పనిచేశారు.


**ఆహ్వానం**

అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళన్ హైదరాబాద్ మరియు విశ్వసాహితి
సంయుక్తంగా నిర్వహిస్తున్న
"కళాప్రపూర్ణ" "కృష్ణానంద" డాక్టర్ పోతుకుచి సాంబశివరావు గారి
జయంతి మహోత్సవం మరియు కవిగాయక సమ్మేళనం

తేది : 27-1-2026, మంగళవారం ఉ॥ 10.30 గం॥లకు
వేదిక : అశోక్ నగర్ సంస్కృతి కేంద్రం, అశోక్‌నగర్, హైదరాబాద్-500020.

**సభా కార్యక్రమం**

ముఖ్య అతిథులు : డా॥ ఏనుగు నరసింహారెడ్డి గారు
సంచాలకులు, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ
సభాధ్యక్షులు : ఆచార్య కడారి సత్యమూర్తి
అధ్యక్షులు - ఎబిబిఎస్ఎస్, హైదరాబాద్
విశిష్ట అతిథులు : ఆచార్య టి. గౌరీ శంకర్ గారు
పూర్వ రిజిస్ట్రార్, తెలుగు విశ్వవిద్యాలయము
ఆత్మీయ అతిథులు: శ్రీ బైసా దేవదాస్ గారు సంపాదకులు, నేటినిజం
కార్యక్రమ నిర్వహణ: శ్రీమతి గోళ్లమూడి పద్మావతి
అధ్యక్షులు, మహిళా విభాగం ఎబిబిఎస్ఎస్
శ్రీ ఎన్.వి. రఘువీర్ ప్రతాప్
ప్రధాన కార్యదర్శి, ఎబిబిఎస్ఎస్

అతిథులచే కవులకు సత్కారం
కవులు తమ పేర్లు ఈ క్రింది ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని మనవి)
ఫోన్ నెంబర్లు : 9618895543, 9440551552

కార్యవర్గం :
అఖిల భారతీయ భాష సాహిత్య సమ్మేళన్, హైదరాబాద్


# వెంకటేశ్వరుని ఆశీస్సులు ఉండాలి



అమరావతి, జనవరి 22: కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలపై, కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఎల్లప్పుడూ ఉండాలని పుట్టపర్తి నియోజకవర్గ శాసనసభ్యురాలు పల్లె సింధూర రెడ్డి ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా, సంతోషంగా జీవించాలంటూ ఆ భగవంతుడిని ప్రార్థించినట్లు ఆమె తెలిపారు.

తిరుపతిలో రెండు రోజులుగా జరుగుతున్న మహిళా శిశు సంక్షేమం, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమంపై ఏర్పాటు చేసిన మహిళా ప్రజా ప్రతినిధుల కమిటీ సమావేశాలకు హాజరైన సందర్భంగా ఈ రోజు ఆమె తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం వీఐపీ బ్రేక్ దర్శనంలో సహచర మహిళా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు విజయవంతంగా అమలుకావాలని, ముఖ్యంగా మహిళలు, పిల్లలు, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలకు భగవంతుని కృప లభించాలని స్వామివారిని వేడుకున్నట్లు ఆమె పేర్కొన్నారు. ప్రజలకు మరింత మెరుగైన పాలన అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందుకు ప్రజల సహకారం కూడా అవసరమని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

తిరుమల దర్శనం అనంతరం ఆలయ అధికారుల ఆశీర్వచనాలు స్వీకరించిన పల్లె సింధూర రెడ్డి, అనంతరం మహిళా ప్రజా ప్రతినిధుల కమిటీ సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ సమావేశాల్లో మహిళా సాధికారత, సామాజిక సంక్షేమం, పేదల అభ్యున్నతికి తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చ జరిగినట్లు సమాచారం.

# మున్సిపల్లో సత్తా చాటుదాం..

**-కాంగ్రెస్‌వి వట్టి మాటలే.. చేసింది శూన్యం..**
**-జిల్లాల పునర్విభజన పేరుతో గందరగోళం..**
**-ప్రతి గడపకు కాంగ్రెస్ బాకీ కార్డు**
**-బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



రాజన్న సిరిసిల్ల, జనవరి 22: నేటినిజం (ప్రతినిధి): మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుదామని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ రోజు సిరిసిల్లలోని తెలంగాణ భవన్లో మున్సిపల్ ఎన్నికలపై వార్డు ఇన్చార్జీలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల తర్వాత ఇక స్థానిక ఎన్నికలు ఉండవని, నేరుగా సాధారణ ఎన్నికలే ఉంటాయన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాల పునర్విభజన పేరుతో గందరగోళం సృష్టిస్తోందని మండిపడ్డారు. రాజన్న సిరిసిల్ల జిల్లాను ఎత్తివేయాలనే కుట్రలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని, ఈ అంశం సిరిసిల్ల ప్రజలు, న్యాయవాదులు, మేధావుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. జిల్లాలను ఎత్తివేయడానికి సిద్ధమైన ప్రభుత్వం సెస్సు కూడా ఎత్తివేయడంలో ఆశ్చర్యం లేదన్నారు.

సిరిసిల్ల ఒకప్పుడు ఎలా ఉందో.. బీఆర్ఎస్ పాలనలో ఎలా అభివృద్ధి చెందిందో ప్రజలకు స్పష్టంగా వివరించాలని సూచించారు. "మన పని మనమే చెప్పుకోవాలి.. వేరే ఎవరు చెప్పరు" అని స్పష్టం చేశారు. సిరిసిల్ల మున్సిపాలిటీ గెలవడమే కాదు.. అన్ని వార్డులను బీఆర్ఎస్ కైవసం చేసుకోవాలన్నారు. రేవంత్ రెడ్డి పాలనను తుగ్లక్ తరహా నిర్ణయాల పాలనగా కేటీఆర్ అభివర్ణించారు.

సర్పంచ్ ఎన్నికల ఫలితాలతో కాంగ్రెస్ షాక్లో ఉందని, అందుకే కార్పొరేషన్ ఎన్నికలు పెట్టడానికి భయపడుతోందన్నారు. రాష్ట్రంలో 40 శాతం పైగా సర్పంచ్ స్థానాలను బీఆర్ఎస్ కైవసం చేసుకుందని, కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వేళ్ల మీద లెక్క పెట్టే స్థానాలను కూడా గెలవలేదన్నారు. సిరిసిల్ల పట్టణం గత 35 ఏళ్లుగా కాంగ్రెస్‌కు దూరంగా ఉందని, బీఆర్ఎస్ ఆవిర్భావం తర్వాత మున్సిపాలిటీపై పూర్తి ఆధిపత్యం సాధించామన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు సింగిల్ డిజిట్ కూడా దాటలేని పరిస్థితిలో ఉన్నాయన్నారు. బీఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధిని ప్రతీ ఇంటికి చెప్పాలని, కాంగ్రెస్ బాకీ కార్డు ప్రతి గడపకు తీసుకెళ్లాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఎంతవరకు అమలయ్యాయో, వృద్ధులు, మహిళలు, రైతులు, నేతన్నలు, రిటైర్డ్ ఉద్యోగులకు ప్రభుత్వం ఎంత బాకీ పెట్టిందో ప్రజలకు వివరించాలని సూచించారు.

సంక్రాంతి దాటినా రైతు బంధు రాలేదని, బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వలేదని, రిటైర్డ్ ఉద్యోగులకు పింఛన్లు, కూడా దిక్కులేని పరిస్థితి ఉందన్నారు. నేతన్నలకు నిజమైన అండగా నిలిచింది కేవలం బీఆర్ఎస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికలను నేరుగా తానే పర్యవేక్షిస్తానని, ప్రజలు ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ వైపే ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు.

కాంగ్రెస్కు బీఆర్ఎస్ ఫీవర్ పట్టుకుందని, సిరిసిల్ల ప్రజలంతా గులాబీ జెండా వైపే ఉన్నారన్నారు.

సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త, ప్రతి వార్డు ఇంచార్జి ఇంటింటి ప్రచారం చేస్తూ ప్రజల మధ్యకు వెళ్లాలని, అభివృద్ధిని వివరించి కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

## త్రికోటేశ్వరస్వామిని దర్శించుకున్న పవన్ కళ్యాణ్

అమరావతి, జనవరి 22: ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కోటప్పకొండలోని శ్రీ త్రికోటేశ్వర స్వామి వారిని దర్శించుకుని ఆశీస్సులు అందుకున్నారు.

ధర్మం, ధైర్యం, సేవ మార్గంలో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ పర్యటన ఆయన రాజకీయ ప్రస్థానంలో ఒక ముఖ్య ఘట్టంగా నిలిచింది.

# దేవస్థానంలో పారిశుధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యం

## -దుర్గ గుడి ఈఓ శీనా నాయక్

అమరావతి, జనవరి 22:శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో పారిశుధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని దేవస్థానం కార్యనిర్వహణాధికారి శీనా నాయక్ అన్నారు. ఆలయ ప్రతిష్ట, భక్తుల అనుభూతి పూర్తిగా పారిశుధ్యంపైనే ఆధారపడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఇంద్రకీలాద్రిపై మహామండపం ఆరో అంతస్తులో నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో పారిశుధ్య కార్మికులు, సూపర్వైజర్లు, సంబంధిత విభాగ అధికారులతో ఈఓ ముఖాముఖి చర్చలు జరిపారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భక్తుడు ఆలయ ప్రాంగణంలో అడుగుపెట్టిన క్షణం నుంచే పరిశుభ్రత అతనికి ప్రశాంతతను ఇవ్వాలని, ఈ విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని తెలిపారు. పారిశుధ్య కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ వారు నిర్వహిస్తున్న పని కేవలం శుభ్రపరిచే విధి మాత్రమే కాదని, అది అమ్మవారికి చేసే పవిత్ర సేవగా భావించాలని సూచించారు.

భక్తుల నడకతో పవిత్రమైన ఆలయ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచడం ద్వారా పుణ్యఫలాలు లభిస్తాయని, విధుల పట్ల పూర్తి బాధ్యతతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆలయ పరిసరాల్లో ఎక్కడా చెత్తాచెదారం కనిపించకుండా జీరో గార్బేజ్ విధానాన్ని కఠినంగా అమలు చేయాలని ఆదేశించారు. క్యూ లైన్లు, ప్రసాదం కౌంటర్లు, స్నానఘట్టాలు వంటి భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలతో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు.

ఆధునిక పారిశుధ్య పరికరాల వినియోగంతో పాటు రసాయనాల వాడకంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్మికుల భద్రత, సంక్షేమంపై కూడా ఈఓ ప్రత్యేక శ్రద్ధ చూపారు. విధుల్లో ఉన్నప్పుడు యూనిఫాం, గ్లౌజులు, మాస్కులు తప్పనిసరిగా ధరించాలని ఆదేశించారు. కార్మికులు ఎదుర్కొనే సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని, వారి సంక్షేమానికి దేవస్థానం కట్టుబడి ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఇంద్రకీలాద్రిని రాష్ట్రంలోనే అత్యంత పరిశుభ్రమైన ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దడమే మన లక్ష్యం అని ఇందులో ప్రతి పారిశుధ్య కార్మికుడి పాత్ర కీలకం అని శీనా నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సి.హెచ్. రంగారావు మాట్లాడుతూ, ఆలయంలో పారిశుధ్యం ఒక సాధారణ పని కాదని, అది అమ్మవారికి చేసే సేవగా భావించి అంకితభావంతో పనిచేయాలని కార్మికులను కోరారు. విధుల్లో సమయపాలన పాటించాలని, భక్తులతో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఈఓ ఎన్. రమేష్ బాబు, పారిశుధ్య విభాగం ఇన్స్పెక్టర్లు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రియుడితో కలిసి భార్య ఘాతుకం

అమరావతి, జనవరి 22:తండ్రి హత్యచేయబడి తల్లి జైలుకెళ్లి ఇద్దరూ పిల్లలు అనాధలుగా చేసింది వివాహేతర సంబంధం. అన్యోన్య సంసా రంలో వివాహేతర సంబంధం నేపథ్యంలో భర్తనే హతమార్చిన సంఘటన గ్రామంలో విషాద ఛాయాలని నింపింది. పచ్చని పంటపొలాలు వ్యవసాయ పనులతో కళకళలాడే గ్రామంలో ఎన్నడూ చూడని, జరగని ఘటన ఆందోళన కలిగించింది.

వివరాల్లోకి వెళితే గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామంలో ప్రియు డితో కలిసి భర్తని భార్య సినీ పక్కిలో హత్య చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చిలువూరుకి గ్రామానికి చెందిన లోకం శివనాగరాజు గత మూడు రోజుల క్రితం మృతి చెందాడు. అనారోగ్య కారణాలతో భర్త మృతి చెందాడని భార్య బంధువులకి తెలిపింది.

అయితే బంధువులు అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు అనుమాస్పద మృతిగా కేసు నమోదు చేసి పోస్ట్ మార్టంకి పంపారు. పోస్ట్ మార్టం నివేదిక ఈ రోజు రావడంతో అనుమాస్పద మృతి హత్యగా పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మృతుడికి భార్య లక్ష్మి మాధురి, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు.

### హత్యగా పోస్ట్ మార్టం రిపోర్ట్ నివేదిక

చిలువూరు గ్రామంలో అనుమానస్పద మృతిగా నమోదైన లోకం శివనాగరాజు కేసు పోస్ట్ మార్టం నివేదిక సంచలనం విషయాలు బయటపెట్టింది. భార్య స్థానికులకి గుండె నొప్పి వచ్చి శివ నాగరాజు చనిపోయినట్లు చెప్పిన విషయంలో నిజం లేదని నివేదిక ఆధారంగా దుగ్గిరాల పోలీసులు భార్య లక్ష్మి మాధురిని అదుపులోనికి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ విచారణలో ప్రియుడుతో కలిసి భార్య మాధురి భర్తని హత్య చేసినట్లు పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రియుడుతో వివాహేతర సంబంధం కొనసాగించడానికి అడ్డుగా ఉన్నట్లు గుర్తించి కట్టుకున్న భర్తనే చంపినట్లు పేర్కొన్నారు. మత్తులోనికి వెళ్లేలా ఆహారంలో భర్తకి మత్తు పదార్థం కలిపి, అనంతరం చాతీపై గట్టిగా కొట్టినట్లు ఎముకలు విరిగినట్లు పోస్ట్ మార్టం నివేదికలో పేర్కొన్నారు. సమాజంలో విలువలు కోల్పోయేలా దారుణం హత్యగా చేసినట్లు తెలుస్తుంది.

### హత్యకి కారణం వివాహేతర సంబంధం..!.

చిలువూరు గ్రామానికి చెందిన మృతుడు లోకం శివ నాగరాజుకి లక్ష్మి మాధురితో 2007లో వివాహం జరుగగా వారికి ఇద్దరు మగ సంతానం. మృతుడి శివనాగరాజు భార్య లక్ష్మి మాధురి విజయవాడలో పనిచేస్తున్నప్పుడు గోపి అనే వ్యక్తితో పరిచయం ఏర్పడినట్లు అది వివాహేతర సంబంధంగా మారింది. గతంలో ఇతర ప్రాంతంలో వ్యాపారం చేసిన శివనాగరాజు గత కొంతకాలంగా ఇంటి వద్ద నుండే వ్యాపారం కొనసాగిస్తుండటంతో ప్రియుడితో సంబంధం కొనసాగించడానికి అడ్డంగా మారింది.

ఈ నేపథ్యంలో భార్యభర్తల మధ్య వివాదాలు చోటు చేసుకోడం జరిగినట్లు తెలుస్తుంది. దీనితో ప్రియుడు గోపి తో కలిసి హత్యకి పథకం వేసింది. ఈనెల 18న బిర్యానీలో మత్తు బిళ్లలు వేసి అనంతరం ప్రియుడి గోపితో కలిసి లక్ష్మి మాధురి హత్య సేసినట్లు విచారణలో ఒప్పుకున్నట్లు సమాచారం. అదేవిధంగా రాత్రి మొత్తం భర్త మృత దేహం వద్దనే పోర్న్ వీడియోలు చూస్తూ కూర్చున్నట్లు విచారణలో పేర్కొన్నట్లు తెలుస్తుంది. అక్రమ సంబంధం కుటుంబాన్ని ఛిద్రం చేసి ఇద్దరు పిల్లల్ని అనాథలుగా మిగిల్చింది.

# విశాఖపట్నంలోని నౌకా దళ శాస్త్ర, సాంకేతికత ప్రయోగశాలను సందర్శించిన రక్షణ రంగ పార్లమెంటరీ స్థాయీ సంఘం

న్యూఢిల్లీ, జనవరి 22:శ్రీ రాధా మోహన్ సింగ్ నేతృత్వంలో రక్షణ రంగ పార్లమెంటరీ స్థాయీ సంఘం 2026 జనవరి 20న విశాఖపట్నంలోని నౌకా దళ సైన్స్ అండ్ టెక్నలాజికల్ ప్రయోగశాలను (ఎన్ఎస్టీఎల్)ను సందర్శించి క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టింది. ఈ పర్యటన సందర్భంగా.. ఎన్ఎస్టీఎల్ రూపొందించిన టార్పెడోలు (ఏఎల్డబ్ల్యూటీ, వరుణాస్త్ర, ఈహెచ్ డబ్ల్యూటీ), మైన్లు (ఎంఐజీఎం, పీబీజీఎం), డికాయ్ వ్యవస్థలు (ఎస్ఎఫ్డీ, టార్ బస్టర్), స్మార్ట్, హెచ్ఈఏయూవీ, ఎస్డబ్ల్యూఏఆర్ఎం, జలాంతర్గత వ్యవస్థలు, జలాంతర్గత వాహనాలు, ఉత్పత్తులు, నీటి అడుగున పనిచేసే సంబంధిత ఆయుధ సాంకేతికతలను కమిటీ సభ్యులు పరిశీలించారు.

సముద్రంలో నౌకా స్థిరత్వం, విన్యాసాల పరీక్ష కేంద్రంలో.. ఓ చిన్న నమూనా నౌకపై నిర్వహించిన హైడ్రో-డైనమిక్ పరీక్ష ప్రత్యక్ష ప్రదర్శనను కూడా కమిటీ వీక్షించింది. భారత నావికాదళ అవసరాలకు అనుగుణంగా.. జలాంతర్గత వేదికలు, ఆయుధాలు, అనుబంధ ఉత్పత్తులు, సాంకేతికతల అభివృద్ధిలో ఎన్ఎస్టీఎల్ పరిశోధన- అభివృద్ధి చర్యలను ప్రతినిధి బృందం ప్రశంసించింది.

పార్లమెంటు సభ్యులు, లోకసభ సచివాలయం, రక్షణ మంత్రిత్వ శాఖ అధికారులతో కూడిన ఈ ప్రతినిధి బృందానికి.. రక్షణ పరిశోధన- అభివృద్ధి విభాగం కార్యదర్శి, డీఆర్డీవో చైర్మన్ డాక్టర్ సమీర్ వి. కామత్, నౌకాదళ వ్యవస్థలు- రక్షణ సామగ్రి విభాగం డీజీ డాక్టర్ ఆర్.వి. హరప్రసాద్, ఎన్ఎస్టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ స్వాగతం పలికారు.

పరిశ్రమ - విద్యాసంస్థల మధ్య పరస్పర సహకారం సహా.. ఎన్ఎస్టీఎల్లో జరుగుతున్న పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాల గురించి ఎన్ఎస్టీఎల్ డైరెక్టర్ కమిటీకి వివరించారు. ప్రయోగశాలకు సంబంధించి భవిష్యత్ సాంకేతిక ప్రణాళికలను కూడా ఆయన క్లుప్తంగా వివరించారు. వ్యూహాత్మక ప్రాధాన్యం ఉన్న 'సముద్ర ప్రాంత పర్యవేక్షణ', జలాంతర్గత పరిధుల్లో పర్యవేక్షణ రంగాల్లో ఎన్ఎస్టీఎల్ పరిశోధనలను కమిటీ అభినందించింది.

# సముద్ర ఉత్పత్తుల ఎగుమతులపై వివిధ దేశాల రాయబారులు, హై కమిషనర్లతో మత్స్య శాఖ రౌండ్ టేబుల్ సమావేశం

న్యూఢిల్లీ, జనవరి 22: ద్వైపాక్షిక వాణిజ్యాన్ని బలోపేతం చేసేందుకు, అంతర్జాతీయ మార్కెట్ అనుసంధానాన్ని మెరుగు పరిచేందుకు సీఫుడ్ ఎగుమతుల ప్రోత్సాహంపై రాయబారులు, హై కమిషనర్లతో న్యూఢిల్లీలో 21 జనవరి 2026న రౌండ్ టేబుల్ సమావేశాన్ని కేంద్ర మత్స్య విభాగం, మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమల మంత్రిత్వ శాఖ నిర్వహిస్తుంది. కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ (ఎంఓఎఫ్ఏహెచ్డీ), పంచాయతీ రాజ్ శాఖల మంత్రి శ్రీ రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లలన్ సింగ్ అధ్యక్షతన నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ఎంఓఎఫ్ఏహెచ్డీ, మైనారిటీ వ్యవహారాల శాఖ సహాయమంత్రి శ్రీ జార్జ్ కురియన్, ఎంఓఎఫ్ఏహెచ్డీ, పంచాయతీ రాజ్ సహాయమంత్రి ప్రొఫెసర్ ఎస్.పి. సింగ్ బఘేల్ గౌరవ అతిథులుగా పాల్గొంటారు.

ప్రపంచంలోనే రెండో అతి పెద్ద ఆక్వాకల్చర్ ఉత్పత్తిదారుగా, చేపలు, ఇతర జలాహార ఉత్పత్తుల్లో ప్రపంచంలోనే అగ్రగామి దేశాల్లో ఒకటిగా భారత్ నిలిచింది. కొన్నేళ్లుగా ఈ రంగం జీవనాధార కార్యకలాపాల స్థాయి నుంచి సాగు, దాణా, ప్రాసెసింగ్, కోల్డ్ చైన్స్, లాజిస్టిక్స్, విలువ ఆధారిత ఉత్పత్తుల వంటి విభాగాలతో బలమైన, ఎగుమతి ఆధారిత వాణిజ్య వ్యవస్థగా మారింది. అంతేకాక, లక్షలాది మంది చిన్న, స్వల్ప, సంప్రదాయ మత్స్యకారులు, రైతులకు నిరంతరం అండగా నిలుస్తుంది. నిర్దేశిత పథకాలు, పటిష్ఠమైన విధానాలతో చేపలు, మత్స్య ఉత్పత్తుల ఎగుమతుల్లో ప్రపంచంలోనే ఆరో అతిపెద్ద దేశంగా భారత్ అవతరించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు 16.98 మెట్రిక్ టన్నులు కాగా, వాటి విలువ సుమారు రూ.62.408 కోట్లు (7.45 బిలియన్ డాలర్లు). భారతదేశ మొత్తం వ్యవసాయ ఎగుమతుల్లో ఈ రంగం వాటా దాదాపు 18%.

ఆసియా, ఆఫ్రికా, యూరప్, ఉత్తర అమెరికా, ఓషియానియా, లాటిన్ అమెరికా, కరేబియన్ ప్రాంతానికి చెందిన 83 దేశాల రాయబారులు, హై కమిషనర్ల భాగస్వామ్యంతో భారత ప్రభుత్వం ఈ రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తుంది. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, మత్స్య శాఖ, సముద్ర ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి సంస్థ (ఎంపీఈడీఏ), ఎగుమతి తనిఖీ మండలి (ఈఐసీ), వాణిజ్య విభాగం, ఫారిన్ ట్రేడ్ డైరెక్టరేట్ జనరల్ (డీజీఎఫ్టీ), ఆహార శుద్ధి పరిశ్రమల మంత్రిత్వ శాఖ (ఎంఓఎఫ్పీఐ)ల సీనియర్ అధికారులు.. అంతర్జాతీయ సంస్థలైన ఫుడ్ అండ్ అగ్రికల్చరల్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఏఓ), ఫ్రెంచ్ డెవలప్మెంట్ ఏజెన్సీ (ఏఎఫ్ డీ), జర్మన్ కార్పొరేషన్ ఫర్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ (జీఐజడ్), బే ఆఫ్ బెంగాల్ ప్రోగ్రామ్ (బీఓబీపీ), ఆసియన్ డెవలప్మెంట్ బ్యాంక్ (ఏడీబీ), ఇంటర్నేషనల్ ఫండ్ ఫర్ అగ్రికల్చరల్ డెవలప్మెంట్ (ఐఎఫ్ఏడీ) ప్రతినిధులు కూడా ఈ సమావేశంలో పాల్గొంటారు. సముద్ర ఆహార వాణిజ్యం, మార్కెట్ లభ్యత, నియంత్రణ సహకారం, నూతన అవకాశాలపై చర్చలకు ఈ సదస్సు కీలకమైన దౌత్య, సాంకేతిక వేదిక కానుంది.

సుస్థిర, పారదర్శక, విలువ ఆధారిత సముద్ర ఆహార వాణిజ్యాన్ని ప్రోత్సహించటంపై ఈ చర్చలు ప్రధానంగా దృష్టి సారిస్తాయి. పెట్టుబడులు, ఉమ్మడి భాగస్వామ్యాలు, సాంకేతిక బదిలీ, సామర్థ్య పెంపుదల వంటి అంశాల్లోని అవకాశాలను గుర్తిస్తాయి. వాతావరణ మార్పులు, మార్కెట్ ఒడిదొడుకులను తట్టుకుని సముద్ర ఆహార సరఫరా వ్యవస్థను పటిష్ఠం చేసే మార్గాలపైనా చర్చలు జరుగుతాయి. ప్రపంచ సీఫుడ్ వాణిజ్య పోకడలు, మార్కెట్ వైవిధ్యం; ప్రమాణాలు, ధృవీకరణ, నియంత్రణ సహకారం; ట్రేసబిలిటీ, డిజిటల్ రిపోర్టింగ్, నిబంధనల వ్యవస్థ; సుస్థిరత, బాధ్యతాయుతమైన సేకరణ; విలువను జోడించటం, ప్రాసెసింగ్, ఉత్పత్తి ఆవిష్కరణ; కోల్డ్ చైన్ మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్స్, ఓడరేవుల అనుసంధానం; బ్లూ వాల్యూచైన్‌లో ఆర్థిక సహాయం, భాగస్వామ్యాలు, ప్రైవేట్ భాగస్వామ్యాల ప్రోత్సాహం; మత్స్య, ఆక్వాకల్చర్ రంగంలో డిజిటల్, సాంకేతిక మార్పులు వంటి ముఖ్యమైన ఇతివృత్తాలపై చర్చలు జరుగుతాయి.

ఈ చర్చలు అభివృద్ధి చెందుతున్న అంతర్జాతీయ మార్కెట్ పోకడలను స్పష్టం చేస్తాయి. ముఖ్యంగా ఉత్తర అమెరికా, యూరప్, తూర్పు ఆసియా దేశాల్లో అధిక నాణ్యత గల సర్టిఫైడ్, స్థిరమైన పద్ధతుల్లో లభించే సముద్ర ఆహారానికి పెరుగుతున్న డిమాండ్‌ను, ఆక్వాకల్చర్ ఆధారిత ప్రోటీన్ల వినియోగం పెరగటాన్ని తెలియజేస్తాయి. వీటితో పాటు రెడీ టు కుక్, రెడీ టు ఈట్, న్యూట్రాస్యూటికల్ గ్రేడ్ గల ప్రీమియం ఉత్పత్తుల విస్తరణపై కూడా చర్చలు జరుగుతాయి. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మెరుగుదల, విలువ ఆధారిత ప్రాసెసింగ్‌పై దృష్టి సారించటం, సాగు రకాల వైవిధ్యం ద్వారా భారత మార్కెట్ వాటాను పెంచుకోవటానికి ఈ తరహా కార్యక్రమాలు గొప్ప అవకాశాలను కల్పిస్తాయి. ఆక్వాకల్చర్ రంగాల్లో భారత్ బలాలు, మెరుగైన ప్రాసెసింగ్ సామర్థ్యం, పటిష్ఠమైన ఎగుమతిదారుల వ్యవస్థ ద్వారా ఈ లక్ష్యాలను సాధించవచ్చు.ఆహార భద్రతను బలోపేతం చేయటానికి, మత్స్య పరిశ్రమ విలువ ఆధారిత వ్యవస్థలో జీవనోపాధిని మెరుగుపరచటానికి సుస్థిరత, స్థితిస్థాపకత, సమగ్రాభివృద్ధి వంటి ఉమ్మడి లక్ష్యాలను సాధించటానికి ఈ సమావేశం ఫలితాలు దోహదపడనున్నాయి.

# ప్రజాదరణ చూరగొన్న వందే భారత్ స్లీపర్ రైలు

న్యూఢిల్లీ, జనవరి 22:కామాఖ్య (కేవైక్యూ), హౌరా (హెచ్‌డబ్ల్యూహెచ్) మధ్య నడిచే వందేభారత్ స్లీపర్ రైలు (రైలు నెం. 27576) మొదటి రోజు ప్రయాణానికి ప్రయాణికుల నుంచి అపూర్వ స్పందన లభించింది. పీఆర్ఎస్, ఇతర సైట్ల ద్వారా టికెట్ రిజర్వేషన్ ప్రారంభమైన కొన్ని గంటల్లోనే అన్ని సీట్లు బుక్ అయ్యాయి. 2026 జనవరి 17న ప్రధానమంత్రి ప్రారంభించిన వందేభారత్ స్లీపర్ రైలు వేగాన్ని, సౌకర్యాన్ని, ఆధునిక వసతులను అనుభూతి చెందాలనే ప్రయాణికుల ఉత్సాహాన్ని వేగంగా అమ్ముడుపోయిన టిక్కెట్లు సూచిస్తున్నాయి.

ఈ రైలు మొదటి వాణిజ్య ప్రయాణం 2026 జనవరి 22 న కామాఖ్య నుంచి, 2026 జనవరి 23న హౌరా నుంచి మొదలవుతుంది. ఈ కొత్త రైలుకు టికెట్ల విక్రయం 2026 జనవరి 19న ఉదయం 8 గంటలకు ప్రారంభం కాగా, 24 గంటల వ్యవధిలోనే అన్ని తరగతుల టిక్కెట్లు పూర్తిగా అమ్ముడయ్యాయి. ఇది ప్రీమియం సెమీ హైస్పీడు సేవల పట్ల ప్రజల ఆసక్తిని తెలియజేస్తోంది.

వేగవంతమైన, సురక్షితమైన, మరింత సౌకర్యవంతమైన రైలు సేవలకు ప్రయాణికులు ఇస్తున్న ప్రాధాన్యాన్ని మొదటి వాణిజ్య ప్రయాణానికి వచ్చిన స్పందన తెలియజేస్తుంది. ఈశాన్య, తూర్పు భారత్ మధ్య అనుసంధానాన్ని ఈ కామాఖ్య-హౌరా వందేభారత్ స్లీపర్ రైలు మెరుగుపరుస్తుందని అంచనా వేస్తున్నారు. ఇది ఆధునిక సౌకర్యాలు, తగ్గిన ప్రయాణ సమయం, ప్రపంచ స్థాయి ప్రయాణ అనుభవాన్ని అందిస్తుంది.

భారతీయ రైల్వేలు అందిస్తున్న అత్యాధునిక రైలు సేవల పట్ల ప్రయాణికుల్లో పెరుగుతున్న నమ్మకాన్ని, ఆసక్తిని కొన్ని గంటల్లోనే పూర్తయిన టిక్కెట్ల విక్రయం చెబుతున్నది. ఈ ప్రాంతంలో ప్రీమియం రైలు ప్రయాణంలో కొత్త అధ్యాయాన్ని ఇది సూచిస్తుంది.

# క్రీడాకారులకు అండగా ఉంటా..

### రాష్ట్ర స్థాయి టోర్నీలు నిర్వహిద్దాం
### -ఘనంగా ప్రారంభమైన 69వ ఎస్‌జీఎఫ్ అంతర్ జిల్లాల సాఫ్ట్‌బాల్ పోటీలు
### -క్రీడలతోనే మానసిక స్థైర్యం, నాయకత్వ లక్షణాలు
### -మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

అమరావతి, జనవరి 22: కమ్మర్ పల్లి మండల కేంద్రంలోని ఇండోర్ మైదానంలో జరుగుతున్న 69వ ఎస్‌జీఎఫ్ అంతర్ జిల్లాల సాఫ్ట్‌బాల్ అండర్-17 బాల, బాలికల టోర్నమెంట్, ఎంపికల పోటీల' కార్యక్రమానికి మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఈ రోజు క్రీడలను ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి వచ్చిన క్రీడాకారులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. రాష్ట్ర నలుమూలల నుండి వచ్చిన క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.

క్రీడల నిర్వహణలో పీఈటీలు, నిర్వాహకులు చూపిస్తున్న చొరవను, వారి అంకితభావాన్ని ఆయన కొనియాడారు. క్రీడాకారులకు, అసోసియేషన్ సభ్యులకు ఎల్లప్పుడూ తన సహకారం ఉంటుందని, క్రీడల నిర్వహణలో ఎవరూ వెనకడుగు వేయవద్దని, తాను ఎప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కమ్మర్‌పల్లి లేదా వేల్పూర్ వేదికగా రాష్ట్ర స్థాయి ఈవెంట్‌ను నిర్వహించాలన్న ప్రతిపాదనకు ఆయన సానుకూలంగా స్పందించారు.

ఎక్కడ వీలైతే అక్కడ పెద్ద ఎత్తున టోర్నమెంట్లు నిర్వహించాలని సూచించారు. రాష్ట్రంలోని మరే నియోజకవర్గంలో లేని విధంగా, బాల్కొండ నియోజకవర్గంలో రెండు ఇండోర్ స్టేడియంలు (కమ్మర్‌పల్లి, వేల్పూర్) ఉన్నాయని గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో ఈ మౌలిక సదుపాయాలను కల్పించుకున్నామని, వీటిని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తన తండ్రి, స్వర్గీయ వేముల సురేందర్ రెడ్డి గొప్ప క్రీడాకారుడని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

ఆయన జాతీయ స్థాయి వాలీబాల్ క్రీడాకారుడని, సీనియర్ నేషనల్స్ ఆడారని, అలాగే క్రికెట్, కబడ్డీ, బ్యాడ్మింటన్ వంటి అన్ని క్రీడలలో రాణించారని తెలిపారు. విద్యాసాగర్ సూచించినట్లుగా, భవిష్యత్తులో సురేందర్ రెడ్డి పేరు మీద రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ నిర్వహించడానికి అసోసియేషన్, అధికారులు చొరవ తీసుకుంటే, దానికి తన పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు.

పోటీతత్వమే గెలుపుకు తొలిమెట్టని, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనడమే ఒక గొప్ప విజయమని, ప్రతి జిల్లాలో వేలాది మంది విద్యార్థులు ఉండగా, కేవలం 16 మంది మాత్రమే జిల్లా జట్టుకు ఎంపికవుతారని, అటువంటి ప్రతిభావంతులు ఇక్కడికి రావడం అభినందనీయమని అన్నారు. గెలుపు, ఓటములను క్రీడాస్ఫూర్తితో సమానంగా స్వీకరించాలని సూచించారు. జీవిత పాఠాలు నేర్పే క్రీడలు, నిజ జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లను, కష్టనష్టాలను తట్టుకునే మానసిక స్థైర్యం క్రీడల ద్వారానే అలవడుతుందని తెలిపారు.

విద్యార్థులు చదువుకు 60 శాతం, క్రీడలకు 40 శాతం ప్రాధాన్యత ఇవ్వాలని, అప్పుడే సంపూర్ణ వికాసం సాధ్యమని తల్లిదండ్రులకు, విద్యార్థులకు సూచించారు. శారీరక ధృఢత్వంతో పాటు మెంటల్ ఎబిలిటీ కూడా క్రీడల వల్లే వస్తుందన్నారు. దూర ప్రాంతాల నుండి వచ్చిన క్రీడాకారులకు మంచి భోజన వసతి కల్పించాలని నిర్వాహకులకు ఆదేశించారు. మండలం, గ్రామ పార్టీ పక్షాన టోర్నమెంట్ నిర్వహణకు అవసరమైన ఆర్థిక సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

విద్యార్థులు ఇక్కడ ఉన్న సౌకర్యాలతో సర్దుకుపోయే తత్వాన్ని అలవర్చుకోవాలని కోరారు. త్వరలో జరగబోయే వాలీబాల్ టోర్నమెంట్‌కు కూడా తమ వంతు సహాయం అందిస్తామని, పిల్లల భవిష్యత్తు కోసం క్రీడలను ప్రోత్సహిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కొత్తపల్లి హారిక అశోక్, క్రీడా సంఘం బాధ్యులు సాఫ్ట్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రటరీ శోభన్, నాగమణి ఎస్‌జీఎఫ్ సెక్రటరీ నిజామాబాద్, ప్రభాకర్ రెడ్డి సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్.


# షిర్డీలో ఉద్యోగుల జాతీయ మహాసభలు..

### -మహాసభలకు తరలివెళ్లిన ఏపీ ఎన్‌జీజీవో ప్రతినిధులు..
### -ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై సమాఖ్య మహాసభల్లో చర్చిస్తాం..
### -ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తీర్మానాలు చేస్తాం..
### -ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్..

విజయవాడ, జనవరి 22: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 21 నుంచి 26వ తేదీ వరకు మహారాష్ట్రలోని షిర్డీలో జరగనున్న అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య 18వ జాతీయ మహాసభల్లో చర్చించి తీర్మానాలు రూపొందించి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమర్పించేలా చర్యలు తీసుకుంటామని సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు, ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ తెలిపారు.

షిర్డీలో ఈ నెల 21వ తేదీ నుంచి జరగనున్న అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ మహాసభల్లో పాల్గొనేందుకు ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎ.విద్యాసాగర్, డీవీ రమణల నేతృత్వంలో దాదాపు 65 మంది ఉద్యోగ సంఘాల నేతల బృందం గురువారం విజయవాడ నుంచి షిర్డీకి రైలు మార్గంలో బయలుదేరి వెళ్లారు.

ఈ సందర్భంగా విజయవాడ రైల్వే స్టేషన్ వద్ద మీడియా ప్రతినిధులతో విద్యాసాగర్ మాట్లాడుతూ అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు సుభాష్ లాంబా, ప్రధాన కార్యదర్శి శ్రీకుమార్ నేతృత్వంలో షిర్డీలో 18వ జాతీయ మహా సభలు జరగనున్నాయన్నారు. మహాసభల్లో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన దాదాపు 1200 మందికి పైగా ఉద్యోగ సంఘాల ప్రతినిధులు హాజరవుతారని.. దేశం నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా ఆత్మీయ అతిథులుగా వివిధ సమాఖ్యలకు సంబంధించిన ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు.





మన రాష్ట్రం నుంచి వివిధ జిల్లాలకు చెందిన వంద మంది ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సదస్సుకు తరలివెళ్తున్నారన్నారు. సమావేశంలో పాల్గొనే ప్రతినిధులకు రాష్ట్ర ప్రభుత్వం మూడు రోజులు స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి వివిధ సమస్యలను ప్రస్తుత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని.. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉద్యోగుల సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు సానుకూల దృక్పథంతో ఉందన్నారు.

మహాసభల్లో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సీపీఎస్ అంశం, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, వివిధ రాష్ట్రాలలో ఉన్న వేతన సవరణ సమస్యలు, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్ల మీద చర్చ, అంతర్జాతీయంగా జరుగుతున్న వివిధ పరిణామాలపై సమావేశాల్లో చర్చించి, పలు తీర్మానాలు చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా అఖిలభారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ కార్యవర్గానికి కూడా ఈ నెల 26వ తేదీన ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. ఎన్నికల్లో జాతీయ ఉపాధ్యక్షుడిగా తిరిగి పోటీచేస్తున్నట్లు ఏపీ ఎన్‌జీజీవో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ తెలిపారు.

సమాఖ్య జాతీయ సదస్సులో పాల్గొనేందుకు షిర్డీకి తరలివెళ్లిన వారిలో ఎ.విద్యాసాగర్, రమణలతో పాటు రాష్ట్ర సంఘ ప్రతినిధులు భారతీ ప్రసాద్, కె.జగదీశ్వరరావు, సుబ్బారెడ్డి, రంజిత్ నాయుడు, మహిళా ప్రతినిధులు జానకి, రాజ్యలక్ష్మి, శాంతిశ్రీ, సరస్వతి, సురేఖ, శివలీల, విజయశ్రీ, లలితాంబ, క్యాపిటల్ సిటీ అధ్యక్షుడు నాగభూషణం, వివిధ జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, విజయవాడ నగరశాఖ ప్రతినిధులు ఉన్నారు.

# ఎన్ని నోటీసులు ఇచ్చినా.. ప్రశ్నిస్తూనే ఉంటాం : హరీశ్ రావు



మెదక్, జనవరి 22:మెదక్ జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి ప్రజలు ప్రశ్నిస్తున్నారని డైవర్షన్ టాక్టిక్స్ చేస్తున్నాడు. నిన్న నాకు నోటీసులు ఇచ్చిండు.. నేడు కేటీఆర్‌కు ఇచ్చిండన్నారు.

కేటీఆర్ ఒకవైపు నుంచి నిలదీస్తుండు.. ఇంకోవైపు నుంచి నేను అడుగుతనే ఉన్నా. సమాధానాల్లేవ్.. నీ బొగ్గు కుంభకోణంలో నీ బావమరిదికే నువ్వు సాయం చేసినవ్ నీ సంగతి ఏందంటే.. దాని మీద సమాధానం లేదు. సిట్ నోటీసులు పంపుతుండు. భయపడుతమనుకుంటున్నవా.. నువ్వు ఎన్ని నోటీసులు ఇచ్చినా బిడ్డా నిన్ను ప్రశ్నిస్తూనే ఉంటామని హరీశ్ రావు స్పష్టం చేశారు.

మహాలక్ష్మి ఇచ్చే దాకా అడుగుతాం. రైతు రుణమాఫీ అడుగుతాం. నువ్వు అవ్వా తాతలకు రూ.4వేలు ఇచ్చేదాకా అడుగుతం. నువ్వు తులం బంగారం ఇచ్చే దాకా అడుగుతనే ఉంటం. ఎస్సీ, ఎస్టీ, బీసీ పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు ఇచ్చేదాకా రేవంత్ రెడ్డి వెంట పడుతూనే ఉంటం. నువ్వు ఎన్ని నోటీసులు ఇచ్చినా.. ఎన్ని అటెన్షన్ డైవర్షన్లు చేసినా నీ వెంటనే పడ్తమని హరీశ్ రావు హెచ్చరించారు.

మనం మున్సిపల్ ఎన్నికల్లో పనిచేసుకోవద్దు. ఈ సిట్ నోటీసులు ఇచ్చి దాని చుట్టూ తిరగాలే. నీ బావమరిది బొగ్గు కుంభకోణం భయటకు రావొద్దు. ఈ సిట్ నోటీసులమీద డైవర్షన్ పాలిటిక్స్ చేయాలే. ఈ డ్రామాలు నడవవు.. జనాలకు అన్నీ అర్థమైపోయినయి. నువ్వు ప్రజలను మోసం చేసినవని హరీశ్ రావు మండిపడ్డారు.

ఇందిరా గాంధీ హయాం నుంచి 40 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా గురించి ఊరించింది తప్ప జిల్లాను చేయలేదు. కానీ కేసీఆర్ మాట ఇచ్చి, మెదక్‌ను జిల్లాగా చేసి చూపించారని హరీశ్ రావు అన్నారు. . ఒకప్పుడు వారానికి ఒకసారి మంచినీళు వచ్చే మెదక్ లో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ స్వచ్ఛమైన మంజీరా జలాలు అందించాం. కలెక్టరేట్, ఎస్పీ ఆఫీస్, 100 పడకల ఆసుపత్రి, మెడికల్ కాలేజీ, మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీలు, మైనార్టీ స్కూల్స్, రైతు బజార్, గ్రంథాలయం, షాదీఖానా.. ఇవన్నీ బీఆర్ఎస్ హయాంలోనే వచ్చాన్నారు.

మెదక్‌కు రైలు తెచ్చింది. పట్టణంలో నాలుగు లైన్ల రోడ్లు వేసింది, ఘనపురం కాలువలను ఆధునీకరించింది, హల్దీ వాగుపై చెక్ డ్యాములు కట్టింది కేసీఆర్ ప్రభుత్వమేనని హరీశ్ రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లయింది. మెదక్ అభివృద్ధి కోసం చేసిన ఒక్క పనిని చూపించగలరా.. అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలన మెదక్ ను అధ్వాన్నంగా మార్చింది. మైనార్టీలకు 4000 కోట్లు బడ్జెట్ పెడతామని మోసం చేశారు. ఇమామ్, మౌజంలకు ఒక్క రూపాయి ఇవ్వలేదు. ఘనపురం ప్రాజెక్టు కింద క్రాప్ హాలిడే ప్రకటించే దుస్థితి తీసుకొచ్చారు.

కేసీఆర్ రైతుబంధు నిధులు నాట్లకు ఇస్తే.. రేవంత్ రెడ్డి కేవలం ఓట్ల కోసమే ఇస్తున్నారు. ట్రాఫిక్ చలాన్ల పేరుతో ప్రజలకు తెలియకుండానే బ్యాంక్ అకౌంట్ల నుండి డబ్బులు కట్ చేస్తామని రేవంత్ రెడ్డి అంటున్నారు. నువ్వు ముఖ్యమంత్రివా లేక సైబర్ నేరగానివా... అని హరీశ్ రావు మండిపడ్డారు.

# క్రీడల నిర్వహణకు, క్రీడాకారులకు అండగా ఉంటా : మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి



నిజామాబాద్, జనవరి 22: నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం ఇండోర్ మైదానంలో జరుగుతున్న 69వ ఎస్‌జీఎఫ్ అంతర్ జిల్లాల సాఫ్ట్‌బాల్ అండర్-17 (బాలబాలికల) టోర్నమెంట్, ఎంపికల పోటీల ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి గురువారం ప్రారంభించారు. తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు.

తాను ఎప్పుడూ క్రీడాకా రులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కమ్మర్‌పల్లి, వేల్పూర్ వేదికగా రాష్ట్ర స్థాయి ఈవెంట్‌ను నిర్వహించాలన్న ప్రతిపాదనకు ఆయన సానుకూలంగా స్పందించారు. రాష్ట్రంలోని మరే నియోజకవర్గంలో లేని విధంగా, బాల్కొండ నియోజ కవర్గంలో రెండు ఇండోర్ స్టేడి యంలు కమ్మర్‌పల్లి ,వేల్పూర్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సహకా రంతో మౌలిక సదుపాయాలను కల్పించుకున్నామని, వీటిని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తన తండ్రి, స్వర్గీయ వేముల సురేందర్ రెడ్డి గొప్ప క్రీడాకారుడని గుర్తు చేసుకున్నారు.

భవిష్యత్తులో వేముల సురేందర్ రెడ్డి పేరుపై రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ నిర్వహిం చడానికి అసోసియేషన్ , అధికా రులు చొరవ తీసుకుంటే తన పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. గెలుపు ఓటములను క్రీడాస్ఫూర్తితో సమానంగా స్వీకరి ంచాలని సూచించారు. జీవిత పాఠాలు నేర్పే క్రీడలు నిజ జీవిత ంలో ఎదురయ్యే ఆటుపోట్లను, కష్టనష్టాలను తట్టుకునే మానసిక స్థైర్యం క్రీడల ద్వారానే అలవడుతుందని తెలిపారు.

క్రీడాకారులకు, అసోసియేషన్ సభ్యులకు తన సహకారం ఉంటుందని, క్రీడల నిర్వహణలో ఎవరూ వెనకడుగు వేయవద్దని సూచించారు. క్రీడల నిర్వహణలో పీఈటీ లు, నిర్వాహకులు చూపిస్తున్న చొరవను, వారి అంకితభావాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కొత్తపల్లి హారిక అశోక్, క్రీడా సంఘం బాధ్యులు సాఫ్ట్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రటరీ శోభన్, నాగమణి, నిజామాబాద్ ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ప్రభాకర్ రెడ్డి , పీఈటీలు విద్యాసాగర్ రెడ్డి, మల్లేష్ గౌడ్, నీరజ రెడ్డి, ఎంఈవో సాయన్న, తహసీల్దార్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## ఆహ్వానం

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో

హైదరాబాద్ విమెన్ రైటర్స్ ఫోరమ్ & హస్మిత ప్రచురణలు నిర్వాహణలో

**విజయ భండారు**

**పుస్తకాల పరిచయ సభ**



రవీంద్రభారతి
మినీహాల్
హైదరాబాద్
23 జనవరి 2026
శుక్రవారం
సా॥ 5:00 గం॥కు



అధ్యక్షత : బి.ఎస్.రాములు (రచయిత, మాజీ ఛైర్మన్ తొలి తెలంగాణ బిసి కమీషన్)

ముఖ్యఅతిధులు: ఏనుగు నరసింహా రెడ్డి (సంచాలకులు, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ)

నామోజు బాలాచారి (కార్యదర్శి తెలంగాణ సాహిత్య అకాడమీ)

వి. సంధ్య Pow

**పరిష్కృత పరిచయం**

నెల్లుట్ల రమాదేవి (రచయిత్రి)

కస్తూరి ప్రభాకర్ (రచయిత)

**సహజాత పరిచయం**

జూపాక సుభద్ర (రచయిత్రి)

పి. జ్యోతి (రచయిత్రి)

సభా నిర్వహణ : నిధి (రచయిత, సాహితీ విమర్శకులు)


## చిన్న మేడారం జాతరకు సహకరించాలి : సీఐ శంకర్ గౌడ్

నల్గొండ, జనవరి 22: లక్షలాదిగా తరలివచ్చే చిన్న మేడారం జాతరకు శాంతిభద్రతల విషయంలో ప్రజలు సహకరించాలని యాదగిరిగుట్ట రూరల్ సీఐ మాదాసు శంకర్ గౌడ్ కోరారు. గురువారం రాజాపేట మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో చిన్న మేడారం సమ్మక్క సారక్క జాతర నిర్వహణపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమ్మక్క సారక్కలు గద్దెలపై తీసుకొస్తున్న క్రమంలో ఎలాంటి అల్లర్లు జరగకుండా జాతర సజావుగా కొనసాగేలా కమిటీ సభ్యులు బాధ్యత తీసుకోవాలని కోరారు. అందరూ కలిసి మెలసి జాతరను విజయవంతం చేయాలన్నారు. జాతరకు విచ్చేసే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తాసీల్దార్ ప్రదీప్, తుర్కపల్లి ఎస్ఐ తయూద్దీన్, సర్పంచులు చింతల సంపత్, బొడ్డు భాస్కర్, ఆర్ఐ నరసింహులు, వివిధ శాఖల అధికారులు, జాతర ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఆర్టీసీలో యూనియన్లను అనుమతించి ఎన్నికలు నిర్వహించాలి'

నల్గొండ, జనవరి 22:ఆర్టీసీలో యూనియన్లు అనుమతించి ఎన్నికలు నిర్వహించాలని, విద్యుత్ బస్సుల విధానంలో ఆర్టీసీకి అవకాశం కల్పించాలని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ డిపో గౌరవాధ్యక్షుడు, సిఐటియు నల్లగొండ జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, రీజియన్ అధ్యక్షుడు కందుల నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా డిపోలో డిమాండ్స్ డేలో భాగంగా బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీజీఎస్ ఆర్టీసీలో యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేసి గుర్తింపు ఎన్నికలు జరపాలన్నారు. కేంద్రం తెచ్చిన 4 లేబర్ కోడ్ లను రాష్ట్రంలో అమలు చయబోమని రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేసి పంపాలని డిమాండ్ చేశారు. విద్యుత్ బస్‌ల విధానంలో మార్పులు చేసి ఆర్టీసీలకు అవకాశం కల్పించాలన్నారు. ప్రజలు, ఆర్టీసీపై భారాలు మోపే విద్యుత్ సవరణ బిల్లు 2025 ఉప సంహరించుకోవాలని కోరారు. రిటైర్డ్ అయిన వారికి రావాల్సిన అన్ని రకాల బకాయిలను వెంటనే చెల్లించాలని, ఎం వి యాక్ట్ 2019 లో సవరణలు చేయాలని కోరారు.

2021, 2025 వేతన ఒప్పందాలను చేయాలని. 2017 వేతనాల ఆధారంగా అలవెన్సులు పెంచాలని విజ్ఞప్తి చేశారు. చి వా డ ఓ ఎ వా స్కీమ్ లలో రిక్రూట్‌మెంట్ అయిన పిల్లలకు ఆర్టీసీలో వెంటనే ఉద్యోగాలు కల్పించాలని, హైర్ పింఛన్ వసతులకు సంబంధించిన డిమాండ్ లెటర్ రాక కార్మికులు నానా ఇబ్బందులు వడుతున్నారని బస్ భవన్‌లో వీరి సమస్యలను ఆర్టీసీ అధికారులు పరిష్కరించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు సంవత్సరాల నుండి రిటైర్డ్ ఉద్యోగులకు పింఛన్ డబ్బులు రాక అనేక అవస్థలు పడుతున్నారన్నారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు వ్యవస్థలను పూర్తిగా రద్దు చేయాలన్నారు. కార్మికులకు ఎప్పుడు అడిగినా కూడా లీవులు ఇవ్వడం లేదన్నారు.

పని గంటల పెంపు అధికం అవుతున్నది, ఎలాంటి పొరపాటు లేకున్నా అనవసర డిపో స్పేర్స్ పెట్టి సతాయిస్తున్నట్లు తెలిపారు. గ్యారేజ్ కార్మికులకు పనిముట్లపై సరైన స్పేర్ పార్ట్స్ లను కల్పించటం లేదన్నారు. పై డిమాండ్ ల సాధన కోసం ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఆర్టీసీ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ డవర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) రీజియన్ సహాయ కార్యదర్శి కె.శ్యాంసుందర్, డిపో అధ్యక్షుడు ఎం. నరసింహయ్య, విజయ్, మాధవి, శ్రీకాంత్, పుల్లయ్య పాల్గొన్నారు.

# జాతర ఏర్పాట్లు పక్కాగా ఉండాలి..

-భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదు
-త్రాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
-24వరకు అన్ని పనులు పూర్తి చేయాలి
-జాతరను విజయవంతంగా పూర్తి చేయాలి
-స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



హైదరాబాద్, జనవరి 22: సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలి. త్రాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి. జాతర కోసం చేపట్టిన అన్ని అభివృద్ధి పనులు 24వ తేదీ లోపు పూర్తిచేయాలి. 25వ తేదీ జరిగే ప్రారంభోత్స వం జాతర పనులకు ఘనంగా ఆరంభం కావాలి..

జాతర కమిటీ చైర్మన్, స్థానిక సర్పంచులు సమన్వయంతో పని చేసి సమ్మక్క సారలమ్మ జాత రను విజయవంతంగా పూర్తి చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. ఈ రోజు స్టేషన్ ఘన్ పూర్ మండలంలోని జిట్టేగూడెం-తాటికొండ పరిధిలో జరిగే మినీ సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లను సంబంధిత శాఖ అధికా రులతో ఆయన కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిశీలించారు.

### రాష్ట్ర ప్రభుత్వం వసతుల కల్పనకు 54లక్షలు మంజూరు :

నియోజకవర్గ పరిధిలోని 7 మినీ సమ్మక్క సారలమ్మ జాతరలలో వస తుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా 54లక్షలు మంజూరు అయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. జాతర ప్రాంతంలో ఫార్మేషన్ రోడ్లు, గద్దెల కలరింగ్, టాయిలెట్స్, త్రాగు నీరు, విద్యుత్ శాఖ సంబంధిత పనులన్నింటిని 24వ తేదీ నాటికి పూర్తి చేయాలి. 25వ తేదీన పను లను ప్రారంబోత్సవం చేసుకోవాలన్నారు. అలాగే 9లక్షల ఎంపీ నిధుల తో 6 జాతరలలో హైమాస్ లైట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ఫార్మే షన్ రోడ్లు, విద్యుత్ వంటి పనులకు మరో 26లక్షలు మంజూరు చేసిన ట్లు మొత్తం 89లక్షల 50వేలతో జాతరలలో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలి పారు. జాతరకు వచ్చే భక్తులకు అన్ని రకాల వసతులు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. జాతర జరిగే నాలుగు రోజులు జాతర స్పెషల్ ఆఫీసర్లు అందుబాటులో ఉండి ఏర్పాట్లను పర్యవేక్షించాలని సూచించారు. జాత రలలో పారిశుధ్య నిర్వహణ పక్కాగా చేపట్టాలన్నారు.

జాతర జరిగే ప్రాంతంలోని చుట్టుపక్కల గ్రామాల నుండి పారిశుధ్య సిబ్బందిని నియమించుకోవాలని తెలిపారు. అలాగే పోలీస్ అధికారులు పటిష్టమైన భద్రత చర్యలు తీసుకోవాలని అన్నారు. అందరూ సమన్వయంతో పని చేసి జాతరలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకన్న, జాతర గౌరవ అధ్యక్షులు చల్లా సుధీర్ రెడ్డి, చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, స్థానిక సర్పంచ్ లు మార పాక సుజన శ్రీనివాస్, బాలు నాయక్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాపోలు మధుసూదన్ రెడ్డి, బేతి జైపాల్ రెడ్డి, నరేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ కట్టమల్లు, పంచాయతీ రాజ్, విద్యుత్, రూరల్ వాటర్ సప్లై, ఎండోమెంట్, రెవిన్యూ, పోలీస్ శాఖల అధికారులు, జాతర కమిటీల చైర్మన్లు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వినియోగదారు రుసుము చెల్లింపుల వ్యవస్థ బలోపేతం దిశగా కేంద్ర మోటారు వాహన నిబంధనల సవరణ

న్యూఢిల్లీ, జనవరి 22:జాతీయ రహదారులపై టోల్ ప్లాజాలలో వినియోగదారు రుసుము చెల్లింపు వ్యవస్థ బలోపేతం దిశగా 'కేంద్ర మోటారు వాహన (2వ సవరణ) నిబంధనలు-2026'ను ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు 'కేంద్ర మోటారు వాహన నిబంధనలు-1989'లో కీలక మార్పులు చేసింది. వినియోగదారు రుసుము చెల్లింపుల మెరుగుదల, ఎలక్ట్రానిక్ టోల్ వసూలు సామర్థ్యం పెంపు, జాతీయ రహదారులపై వినియోగదారు రుసుము ఎగవేతను నిరోధం ఈ సవరణ లక్ష్యం.

సవరించిన నిబంధనల ప్రకారం- 'వినియోగదారు రుసుము బకాయి'ని తాజాగా నిర్వచించింది. జాతీయ రహదారి విభాగంలోని ఎలక్ట్రానిక్ టోల్ వసూలు (ఈటీసీ) వ్యవస్థ వాహనం వెళ్లడాన్ని నమోదు చేసినా, జాతీయ రహదారుల చట్టం-1956 ప్రకారం వర్తించే రుసుము జమకాని పక్షంలో రహదారి వినియోగంపై చెల్లించాల్సిన రుసుమును ఈ నిర్వచనం మేరకు నిర్ణయిస్తారు.

తాజా సవరణ నేపథ్యంలో జమకాని జాతీయ రహదారి వినియోగదారు రుసుము వాహన సంబంధిత సేవలతో అనుసంధానితం అవుతుంది. అంటే- జమకాని వినియోగదారు రుసుము బకాయిల చెల్లింపు పూర్తయ్యే దాకా వాహన యాజమాన్య హక్కు లేదా ఇతర రాష్ట్రానికి బదిలీ కోసం నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం (ఎన్ఓసీ) జారీ కాదు. అంతేగాక రహదారి వినియోగదారు రుసుము బకాయి చెల్లించకపోతే వాహన ఫిట్‌నెస్ నవీకరణ లేదా ధ్రువపత్రం జారీ కాదు. అలాగే జాతీయ పర్మిట్ కోరే వాణిజ్య వాహనాల విషయంలో వినియోగదారు రుసుము బకాయి ఉండరాదన్న నిబంధనను పాటించడం తప్పనిసరి.

తాజా సవరణలకు అనుగుణంగా 'ఫారం-28'లోనూ మార్పులు చేసిన నేపథ్యంలో ఇకపై దరఖాస్తుదారులు టోల్ ప్లాజాలో వినియోగదారు రుసుము బకాయి ఏదైనా ఉన్నదీ, లేనిదీ తెలుపుతూ వివరాలు వెల్లడించాలి. నిర్దిష్ట ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా 'ఫారం-28' సంబంధిత అంశాలపై ఎలక్ట్రానిక్ రూపంలో జారీకి వీలు కల్పించడం ద్వారా డిజిటల్ ప్రక్రియలను కూడా ఈ నిబంధనలు ప్రోత్సహిస్తాయి. ఫారం-28 అంటే- వాహన యాజమాన్యం లేదా మరొక రాష్ట్రం లేదా జిల్లాకు బదిలీ చేసేందుకు అవసరమైన 'ఎన్ఓసీ' జారీ కోసం దరఖాస్తు చేసే కీలక పత్రం. దీనిద్వారా సదరు వాహనంపై పన్నులు, చలానాల బకాయిలతోపాటు చట్టపరమైన సమస్యలేవీ లేవని ధ్రువీకరిస్తారు. 'మల్టీ-లేన్ ఫ్రీ ఫ్లో' (ఎంఎల్ఎఫ్ఎఫ్) వ్యవస్థ అమలు అనంతరం వినియోగదారు రుసుము వసూలులో కూడా ఈ సవరణలు దోహదం చేస్తాయి. తద్వారా జాతీయ రహదారి నెట్‌వర్క్‌లో నిర్నిరోధ టోలింగ్‌కు వీలు కల్పిస్తాయి.నిరుడు (2025) జూలై 11న గెజిట్ నోటిఫికేషన్ ద్వారా ప్రభుత్వం నిబంధనల ముసాయి దాను ప్రకటించి, సాధారణ ప్రజానీకంతోపాటు భాగస్వాముల అభిప్రాయాలను ఆహ్వానించింది. అటుపైన ప్రకటన ప్రతులను 2025 జూలై 14 దాకా అందరికీ అందుబాటులో ఉంచింది. అన్ని మార్గాల నుంచీ అందిన అభిప్రాయాల నిశిత విశ్లేషణ అనంతరం సవరణ నిబంధనలను ఖరారు చేసి, ఇప్పుడు ప్రకటించింది.దేశవ్యాప్తంగా జాతీయ రహదారుల నెట్‌వర్క్ సుస్థిర అభివృద్ధి-నిర్వహణ కోసం పారదర్శక, సాంకేతిక ఆధారిత టోల్ వ్యవస్థల రూపొందించడంలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థకు ఈ సవరణలు ఎంతగానో దోహదం చేస్తాయి.

# కొలనూరు సమ్మక్క సారలమ్మ జాతరకు పటిష్ట బందోబస్తు : డీసీపీ భూక్యా రాంరెడ్డి



కరీంనగర్, జనవరి 22: పెద్దపల్లి జిల్లాలోని సమ్మక్క, సారలమ్మ జాతర నిర్వహణకు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు పెద్దపల్లి డీసీపీ భూక్య రామ్ రెడ్డి తెలిపారు. గురువారం ఓదెల మండలం కొలనూరు గుట్టలో జరిగే సమ్మక్క, సారల మ్మ జాతరను పోలీస్ అధికారు లతో కలిసి సందర్శించారు.

ఈ సందర్భంగా పోలీసు బందో బస్తు, పార్కింగ్‌కు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.కొలనూరు జాతర చుట్టూ గుట్టల మధ్యన చెరువు సమీపం లో చెట్లు ఉండి ఆహ్లాదకరంగా ఉందని పేర్కొన్నారు. జాతర చరిత్రను అడిగి తెలుసుకున్నారు.

ఇక్కడి జాతర మేడారం తర్వాత రెండవ జాతరగా పేరు గాంచినట్టు స్థానికులు వివరించారు.డీసీపీ వెంట పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, పోత్కాపల్లి ఎస్సై దీకొండ రమేష్ గౌడ్, జాతర చైర్మన్ కొలిపాక మధునయ్య, వైస్ చైర్మన్ సట్ల సద య్య గౌడ్, సర్పంచ్ పల్లె కనక య్య, మద్య వేణి రవి యాదవ్, ఉపసర్పంచ్ పాకాల సంపత్ రెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.

# ఉచిత కంటి వైద్య శిబిరం..

కామారెడ్డి, జనవరి 22:కంటి వైద్య శిబిరం నిర్వహించడం ఎంతో అభినందనీయమని బిక్కనూర్ మండలం జంగంపల్లి గ్రామ సర్పంచ్ శ్రీవాణి వాసు యాదవ్ అన్నారు. ఈ రోజు గ్రామంలో కామారెడ్డి లయన్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కంటి వ్యాధులతో ఎవరు బాధపడినా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అవసరం ఉన్నవారు కంటి అద్దాలు వాడుకోవాలని ఆమె కోరారు. గ్రామంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు. కంటి వైద్యాధికారి లింబాద్రి ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ప్రకాష్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి సిద్ధిరాములు, వార్డు సభ్యులు కొండం సుజాత, కుమ్మరి జ్యోతి, భాను ప్రకాష్ తదితరులు ఉన్నారు.

# గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం

-గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి.
- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య.

సంగారెడ్డి జనవరి 22(నేటి నిజం ప్రతినిధి) గ్రామాల సర్వతోముఖాభివృద్ధిలో సర్పంచుల కేంద్రంలో నూతనంగా ఎన్నికైన సర్పంచుల కోసం ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల మొదటి బ్యాచ్




పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు.

గురువారం సంగారెడ్డి పట్టణంలోని దుర్గాబాయి దేశముఖి మహిళా శిశు వికాస ముగింపు సందర్భంగా జిల్లా కలెక్టర్ హాజరై మాట్లాడారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామాలకు మంచి జరగాలంటే సర్పంచులు పంచాయతీ రాజ్ చట్టం-2018పై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నూతనంగా ఎన్నికైన సర్పంచులకు ఆరు బ్యాచులుగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఈ శిక్షణలో గ్రామ పంచాయతీల పనుల నిర్వహణ, గ్రామాభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న కుటుంబ సంక్షేమం, విద్య, ప్రజారోగ్యం, సామాజిక అభివృద్ధి వంటి కార్యక్రమాలపై పూర్తి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణను సర్పంచులు సద్వినియోగం చేసుకుని తమ గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ డి పి ఓ జానకి రెడ్డి , డీఎల్పీఓలు అనిత, అమృత, సంజీవరావు, పంచాయతీరాజ్ అధికారులు, సర్పంచులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తమిళ ఫిల్మ్ స్టార్ విజయ్‌కి పార్టీకి విజిల్ గుర్తును కేటాయించిన ఈసి

న్యూఢిల్లీ జనవరి 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: తమిళ ఫిల్మ్ స్టార్ విజయ్‌కి చెందిన తమిళగ వెట్రి ఖజగం పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం విజిల్ గుర్తును కేటాయించింది. తమిళనాడులో ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. గత ఏడాది నవంబర్ 11వ తేదీన తమ పార్టీకి గుర్తు ఇవ్వాలని కోరుతూ విజయ్‌కు చెందిన టీవీకే పార్టీ కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించింది. 1968 నాటి ఎలక్షన్ సింబల్స్ ప్రచారం తమకు గుర్తు కేటాయించమని అభ్యర్థించింది. మొత్తం ఏడు సింబల్స్‌కు చెందిన లిస్టును ఆ పార్టీ సబ్మిట్ చేసింది. అయితే ఆ గుర్తులన్నీ ఇప్పటికే ఫ్రీగా అందుబాటులో ఉన్నాయి. స్వంతంగా క్రియేట్ చేసిన మూడు మరో సింబల్స్‌ను కూడా ఆ పార్టీ సమర్పించింది.

# అమృత్ ఉద్యాన్‌ను ఫిబ్రవరి 3 నుంచి ప్రజలు చూడవచ్చు

న్యూఢిల్లీ, జనవరి 22: రాష్ట్రపతి భవన్‌లో భాగంగా ఉన్న అమృత్ ఉద్యాన్‌ను 2026 ఫిబ్రవరి 3 నుంచి మార్చి నెల 31 మధ్య ప్రజలు చూసి రావచ్చు. వారంలో ఆరు రోజుల పాటు ఉదయం 10 గంటల మొదలు సాయంత్రం 6 గంటల మధ్య ఈ ఉద్యానవనాన్ని చూడొచ్చు. సోమవారాల్లో ఉద్యానాన్ని మూసి వేస్తారు. ప్రతి సోమవారం ఉద్యానంలో నిర్వహ ణ సంబంధిత పనులు చేపడు తూ ఉండటమే దీనికి కారణం. మార్చి నెల 4న హోలీ కావడం తో, ఉద్యానవనాన్ని మూసి ఉంచుతారు.

ఈ తోట లోపలికి వెళ్లడానికి బుకింగ్ పూర్తి చేసుకోవడం, ప్రవేశించడం ఉచితమే. ఆన్‌లైన్ మాధ్యమం ద్వారా బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. నేరుగా తరలివచ్చే సందర్శకుల కోసం ప్రవేశ స్థానం సమీపంలో సర్వీస్ విజిటర్స్ రిజిస్ట్రేషన్ కియోస్క్‌లను అందుబాటులో ఉంచుతారు.

ఉద్యానాన్ని చూడటానికి వచ్చే వారందరూ నార్త్ అవెన్యూ మార్గం రాష్ట్రపతి భవన్‌కు చేరే చోటుకు దగ్గరగా ఉండే ప్రెసిడెంట్స్ ఎస్టేట్ లో 35 వ నెంబరు గేటు నుంచి లోపలికి వెళ్లి, మళ్లీ అదే గేటు నుంచి బయటకు రావాల్సి ఉంటుంది.

సందర్శకుల సౌకర్యార్థం, సెంట్రల్ సెక్రటేరి యట్ మెట్రో స్టేషన్ నుంచి 35 వ నెంబరు గేటు వరకు షటిల్ బస్సు సేవలు ఉదయం 9.30 గంటల మొదలు సాయంత్రం 6 గంటల మధ్య ప్రతి 30 నిమిషా లకు ఒకటి చొప్పున అందుబా టులో ఉంటాయి.

# ఉత్తమ పురస్కారం..




అమరావతి, జనవరి 22:ఎస్ఐఆర్‌లో భాగంగా చేపట్టిన ఓటర్ జాబితా స్వచీకరణకు సంబంధించి జిల్లాలో ఇరువురికి ఉత్తమ పురస్కారం లభించింది. విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రంలో ఈ నెల 25న నిర్వహించనున్న కార్యక్రమంలో గవర్నర్ చేతుల మీదుగా కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు. కె. రామ్ మురళీమోహన్ తోపాటు ఆలూరు నియోజకవర్గం. బీఎల్ఓ కే లక్ష్మణులు పురస్కారం అందుకోనున్నారు. ఉత్తమ పురస్కారానికి ఎంపికైన వారిని జిల్లా కలెక్టర్. జాయింట్ కలెక్టర్, డీఆర్ఓ అభినందించారు

# శ్రీకేతకి సంగమేశ్వర స్వామి జాతరను అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలి .

-జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి, జనవరి 22 (నేటి నిజం ప్రతినిధి) మహా శివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 12 నుంచి 20 వరకు జరగను న్న ఝురాసంగం శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి జాతరను అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహిం చా లని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య కోరారు.



శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి జాతర నిర్వహణ ఏర్పాట్లపై గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, జహీరాబాద్ శాసనసభ్యులు మాణిక్ రావుతో కలిసి ఆయా శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ తమ శాఖల ద్వారా చేపట్టనున్న ఏర్పాట్లను కలెక్టర్‌కు వివరి ంచారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచిం చారు.

మహిళా భక్తులకు ప్రత్యేకంగా అధిక సంఖ్యలో టాయిలెట్లు, తాత్కాలిక టాయిలెట్లు ఏర్పాటు చేయాలని, స్నానాలకు అవసరమైనన్ని షవర్లు, మంచినీటి సదుపాయాలు కల్పించాలని తెలిపారు. దేవస్థానం వరకు వెళ్లే కనెక్టివ్ రోడ్లను మరమ్మతులు చేయించి గుంతలు పూడ్చాలని, అవసరమైన చోట సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. జాతర ఆవరణతో పాటు దేవస్థానం పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ నిరంతరం సక్రమంగా జరిగేలా చూడాలని, ఎక్కువ మంది పారిశుద్ధ్య కార్మి కులను నియమించుకోవాలని, బ్లీచింగ్, క్లోరినేషన్, ఫాగింగ్ వంటి చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారికి సూచిం చారు. విద్యుత్ సరఫరాలో అంత రాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదే శించారు. ఆరోగ్య శాఖ ఆధ్వర్యం లో జాతర ప్రాంతంలో వైద్య శిబి రాలు ఏర్పాటు చేసి, 108 అం బులెన్స్ వాహనాన్ని అందు బా టులో ఉంచా లని తెలిపారు. అగ్నిప్ర మాదాల నివారణకు దేవ స్థానం పరిసరాల్లో అగ్నిమాపక పరికరాలు, సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని సంబంధిత అధి కారులకు సూచిం చారు. భద్రతా పరంగా గుడి లోపల, బయట, గుడి ఆవరణలో, పార్కింగ్ ప్రాంతాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబ స్తు ఏర్పాటు చేయాలని, మహి ళల స్నాన ప్రాంతాల్లో మహిళా పోలీస్ సిబ్బందిని నియమి ంచా లని పోలీస్ శాఖ అధికారులకు తెలిపారు.

భక్తుల రాకపోకలకు అనుగుణంగా తగినన్ని బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. భక్తుల ఆహ్లాదం కోసం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని విద్యాశాఖ అధికారికి సూచించారు.

హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయడంతో పాటు దివ్యాంగ భక్తుల కోసం వీల్‌చైర్స్ అందుబాటులో ఉంచాలని జిల్లా సంక్షేమ అధికారికి తెలిపారు. దేవస్థానం వద్ద మరో సారి ఆయా అధికారులు అందరితో మీటింగ్ ఏర్పాటు చేయాలని, అన్ని శాఖల అధికారులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి, షిఫ్ట్ వారీగా అధికారుల వివరాలు పొందుపరచాలని, కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆర్డీవోను ఆదేశించారు. ఏవైనా సమస్యలు ఉంటే ఆర్డీవో లేదా తన దృష్టికి తీసుకురావాలని దేవస్థానం ఈవోకు సూచించారు.

ఈ సందర్భంగా జహీరాబాద్ శాసనసభ్యులు మాణిక్ రావు మాట్లాడుతూ, ప్రతి శాఖ అధికారి తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని, రోజువారీ పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా జరిగేలా చూడాలని, భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

అడిషనల్ ఎస్పీ రఘునందన్ రావు మాట్లాడుతూ, ఫిబ్రవరి 14 నుంచి భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున అన్ని ప్రాంతాల్లో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. మహిళల స్నాన ప్రాంతాల్లో మహిళా పోలీసులను నియమిం చి, కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఈ సమావేశంలో జడ్పీ సీఈవో మరియు డిపిఓ జానకి రెడ్డి, జహీరాబాద్ రెవెన్యూ డివి జనల్ అధికారి దేవుజా, ఆయా శాఖల అధికారులు, ఝురాసం గం తహసిల్దార్, దేవస్థానం ఈవో శివ రుద్రప్ప, చైర్మన్ చంద్రశేఖర్ పాటిల్, గ్రామ సర్పంచ్ వినోద, తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

-మాదక ద్రవ్యాల నిరోధానికి శాఖల సమన్వయం అవసరం.
-అడిషనల్ కలెక్టర్ పాండు, అడిషనల్ ఎస్పీ రఘునందన్ రావు

సంగారెడ్డి, జనవరి 22 : యువత మత్తు పదార్థాల బారిన పడకుండా పటిష్టమైన చర్యలు చేపట్టి సంగారెడ్డి జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని అదనపు కలెక్టర్ పాండు తెలిపారు.

గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అడిషనల్ ఎస్పీ రఘునందన్ రావు, అడిషనల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌లతో కలిసి నార్కోటిక్స్ కోఆర్డినేషన్ జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు.



ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ పాండు మాట్లాడుతూ, యువత మాదకద్రవ్యాల రవాణా చేసినా, వినియోగించినా ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కఠిన శిక్షలు విధించబడతాయన్నారు. డ్రగ్స్ నియంత్రణకు జిల్లాలోని అన్ని కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మాదకద్రవ్యాల అలవాటుకు ఎవరూ బానిసలు కావొద్దని, ఎక్కడైనా డ్రగ్స్ వినియోగం జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. అర్బన్, రూరల్ అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలు, భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలన్నారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థలు, బస్ స్టాండ్లు, డ్రగ్స్ వినియోగానికి అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి గట్టి నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో డ్రగ్స్, గుడుంబా తదితర మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలని సూచించారు. కళాశాలల్లో ఏర్పాటు చేసిన డ్రగ్స్ నిరోధక కమిటీలు చురుకుగా పనిచేయాలన్నారు.

అడిషనల్ ఎస్పీ రఘునందన్ రావు మాట్లాడుతూ,ముఖ్యంగా విద్యాసంస్థల్లో సూక్ష్మ నిఘాతో పటిష్ట చర్యలు తీసుకుని విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా చూడాలని తెలిపారు. గంజాయి సాగు చేస్తున్న వారిని గుర్తించి తక్షణమే చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.

సమావేశంలో డ్రగ్స్ నిరోధానికి వివిధ కళాశాలలు, వివిధ శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు.

ఈ సమావేశంలో అడిషనల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, గీతం యూనివర్సిటీ, మహేశ్వర మెడికల్ కళాశాల, ఎమ్మెన్నార్ విద్యాసంస్థలు, వోక్సిన్ యూనివర్సిటీ ప్రతినిధులు, డీడబ్ల్యూవో, డీసీహెచ్‌ఎస్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ, ఆర్టీసీ, వ్యవసాయ, విద్యాశాఖ అధికారులు, ఆటో యూనియన్ ప్రతినిధి తదితరులు పాల్గొన్నారు.

# పథకం ప్రకారం సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగించవద్దన్న శ్రీ ఓం బిర్లా

న్యూఢిల్లీ, జనవరి 22:86వ అఖిల భారత శాసన సభాపతుల సదస్సు (ఏఐపీఓసీ) ముగింపు కార్యక్రమంలో లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా పాల్గొన్నారు. ఉత్తరప్రదేశ్ విధాన్ భవన్‌లో 2026 జనవరి 19 నుంచి 21 వరకు ఈ సదస్సు జరిగింది.

ఈ సదస్సు చివరి సెషన్‌లో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి, రాజ్యసభ ఉపాధ్యక్షుడు, ఉత్తరప్రదేశ్ శాసన మండలి చైర్మన్, ఉత్తరప్రదేశ్ శాసనసభ స్పీకర్ మాట్లాడారు.

ముగింపు కార్యక్రమంలో లోక్‌సభ స్పీకర్ మాట్లాడుతూ.. శాసనసభలను మరింత ప్రభావవంతంగా, ప్రజల అవసరాలకు అనుగుణంగా, జవాబుదారీగా మార్చడానికి 'జాతీయ శాసన సూచిక' తయారు చేయనున్నట్లు తెలిపారు. ఇది శాసనసభల మధ్య ఆరోగ్యకరమైన పోటీని పెంపొందించడమే కాకుండా దేశవ్యాప్తంగా చర్చల నాణ్యత, పనితీరును మెరుగుపరుస్తుందని అన్నారు. దీనికి సంబంధించి ఒక కమిటీని కూడా ఏర్పాటు చేసినట్లు ఆయన తెలియజేశారు.

ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే సమర్థవంతమైన వేదికలుగా శాసనసభలు మారాలంటే రాష్ట్ర శాసనసభలలో ఏడాదికి కనీసం 30 సమావేశాలు జరిగేలా చూడాలని శ్రీ బిర్లా అన్నారు. సభ ఎంత ఎక్కువ కాలం పనిచేస్తే అంత అర్థవంతమైన, తీవ్రమైన, ఫలితాల ఆధారిత చర్చలు సాధ్యమవుతాయని ఆయన పేర్కొన్నారు.

పత్రికా సమావేశంలో కూడా లోక్‌సభ స్పీకర్ మాట్లాడారు. రాబోయే బడ్జెట్ సమావేశాల్లో సభా కార్యకలాపాలు సజావుగా నిర్వహించటంపై అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. సభలో నిర ంతరం, పథకం ప్రకారం కలిగిం చే ఆటంకాలు దేశ ప్రజాస్వామ్యానికి తగవని పేర్కొన్నారు. సభకు అంతరాయం కలిగినప్పుడు అందరికంటే ఎక్కువగా నష్టపోయేది ప్రజలే అని ఆయన అన్నారు. ఆటంక పరిచే సంస్కృతిని కాకుండా చర్చ, సంవాద సంప్రదాయాన్ని బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

సభ సజావుగా సాగేలా సహకరించాలని అన్ని రాజకీయ పార్టీల నాయకులు, సభ్యులకు ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అత్యున్నతమన్న ఆయన.. ప్రజల పట్ల జవాబుదారీతనం కేవలం ఎన్నికల సమయంలోనే కాకుండా ప్రతిరోజూ, ప్రతిక్షణం ఉండాలని పేర్కొన్నారు.

శాసన సభాపతులు కేవలం సభా కార్యకలాపాలను నిర్వహించేవారు మాత్రమే కాదని రాజ్యాంగ సంరక్షకులుగా, ప్రజాస్వామ్య మర్యాదలకు కాపలాదారులుగా ఉంటారని లోక్‌సభ స్పీకర్ వ్యాఖ్యానించారు. సభాపతుల నిష్పాక్షికత, సున్నితత్వం, దృఢ త్వం... సభ సాగే దిశను నిర్ణయి స్తాయని ఆయన అభిప్రాయ పడ్డారు.

86వ అఖిల భారత శాసన సభాపతుల సదస్సులో మొత్తం ఆరు ముఖ్యమైన తీర్మానాలకు ఆమోదం లభించింది:

2047 నాటికి 'వికసిత్ భారత్' అనే జాతీయ లక్ష్యాన్ని సాధించడంలో తమ వంతు కృషి చేయడానికి సభాపతులందరూ సంబంధిత శాసనసభల కార్యకలాపాల నిర్వహణకు పునరంకితం కావాలి.

అన్ని రాజకీయ పార్టీల మధ్య ఏకాభిప్రాయాన్ని సాధించటం ద్వారా రాష్ట్ర శాసనసభల్లో ఏడాదికి కనీసం ముప్పై (30) సమావేశాలు నిర్వహించాలి. ప్రజాస్వామ్య సంస్థలు ప్రజలకు జవాబుదారీగా ఉండేలా చూసుకునేందుకు శాసన పనుల కోసం అందుబాటులో ఉన్న సమయం, వనరులను నిర్మాణాత్మకంగా, సమర్థవంతంగా ఉపయోగించుకోవాలి.

ప్రజలు, శాసనసభలకు మధ్య సమర్థవంతమైన అనుసంధానాన్ని ఏర్పరచడానికి, అర్థవంతమైన భాగస్వామ్య పరిపాలనను నిర్ధారించేందుకు శాసన పనులను సులభతరం చేసే సాంకేతిక పరిజ్ఞానాన్ని నిరంతరం బలోపేతం చేయాలి.

దేశానికి ఉన్న ప్రజాస్వామ్య సంప్రదాయాలు, విలువలు మరింత లోతుగా, బలంగా మారేలా చూసేందుకు భాగస్వామ్య పరిపాలనకు సంబంధించిన అన్ని సంస్థలకు ఆదర్శప్రాయమైన నాయకత్వాన్ని ఇక ముందు కూడా అందించాలి.

శాసనసభల్లో జరిగే చర్చలు, సంవాదాలలో ప్రజాప్ర తినిధులు సమర్థవంతంగా పాల్గొనేలా చూసేందుకు డిజిటల్ సాంకేతికత వినియోగంలో పార్లమెంట్- శాసనసభ సభ్యుల సామర్థ్యాన్ని పెంపొందించడం, పరిశోధన - విశ్లేషణాత్మక మద్దతును ఇక ముందు కూడా నిరంతరం కొనసాగించాలి. బహిరంగ ప్రయోజనాల దృష్ట్యా గరిష్ఠ జవాబు దారీత నంతో కూడిన ఆరోగ్యకరమైన పోటీని ప్రోత్సహించే వాతావర ణాన్ని సృష్టించడానికి, నిర్ణీత ప్రమాణాల ఆధారంగా శాసన సభల పనితీరును నిష్పాక్షికంగా అంచనా వేయటంతో పాటు సరిపోల్చేందుకు ఒక 'జాతీయ శాసన సూచిక'ను రూపొందించాలి.

ఈ సదస్సులో దేశంలోని 24 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 36 మంది శాసనసభాపతులు పాల్గొన్నారు. భాగస్వామ్యం పరంగా 86వ ఏఐపీఓసీ ఇప్పటివరకు జరిగిన అతిపెద్ద సదస్సుగా నిలిచింది.

అఖిల భారత శాసన సభాపతుల సదస్సు వంటి వేదికలు ప్రజాస్వామ్య సంస్థల మధ్య సహకారాన్ని ప్రోత్సహిస్తాయని, పరస్పర సమన్వయాన్ని బలోపేతం చేస్తాయని, పాలనను మరింత ప్రభావవంతంగా చేయడంలో సహాయపడతాయని లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా పేర్కొన్నారు.

సదస్సును విజయవంతంగా నిర్వహించినందుకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం, ఉత్తరప్రదేశ్ శాసన సభ- శాసనమండలి, లోక్‌సభ - రాజ్యసభ కార్యాలయాలతో పాటు పాల్గొన్న సభాపతులు, ప్రతినిధులందరికీ లోక్‌సభ స్పీకర్ కృతజ్ఞతలు తెలియజేశారు.

భారతీయ పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని మరింత పటిష్ఠంగా, జవాబుదారీగా, ప్రజల అవసరాలకు అనుగుణంగా మార్చే దిశగా 86వ అఖిల భారత శాసన సభాపతుల సదస్సు (ఏఐపీఓసీ) ఒక ముఖ్య మైన ఘట్టంగా నిలిచింది.

# బి.సి.లకు చట్టసభలలో 50 శాతం రిజర్వేషన్ల సాధనే నా అంతిమ లక్ష్యం

-అరెకటికలకు కార్పోరేషన్ ఏర్పాటు చేయాలి
-రాజ్యసభసభ్యులు, జాతీయ బి.సి సంక్షేమ సంఘం అధ్యకులు ఆర్. కృష్ణయ్య

హైదరాబాద్ జనవరి 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );బి.సి.లకు చట్టసభలలో 50 శాతం రిజర్వేషన్లు సాధించడమే నా అంతిమ లక్ష్యం అని రాజ్యసభసభ్యులు, జాతీయ బి.సి సంక్షేమ సంఘం అధ్యకులు ఆర్. కృష్ణయ్య స్పష్టం చేశారు. అరెకటిక అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన అరెకటికల సర్పంచ్ ల ఆత్మీయ సన్మాన సభకు కృష్ణయ్య ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ప్రొఫెసర్ కోదండరాం, బీసీ కమిషన్ చైర్మెన్ నిరంజన్, డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్, దొడ్డి కొమరయ్య సినిమా డైరెక్టర్ సేనాపతి, సర్పంచులు డిప్యూటీ సర్పంచులు వార్డు మెంబర్ లు పెద్దఎత్తున్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు గడుస్తున్నపటికి బీసీలకు విద్యా, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగంలో తీవ్ర అన్యాయం జరిగిందని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పాలన రంగంలో బీసీలకు 15% కూడా ప్రాధాన్యత దక్కలేదని అలాగే అధికారంలో 14 శాతం ప్రాధాన్యత దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా ప్రకారం బీసీలకు అన్ని రంగాలలో రిజర్వేషన్లు కల్పించే వరకు విశ్రమించేది లేదని ఆయన హెచ్చరించారు. మేము భారత మాత బిడ్డలం మా వాటా మాకు ఇవ్వాలన్నారు. బీసీలకు అన్ని రంగాలలో రిజర్వేషన్లు కల్పించే



వరకు పోరాటం ఆగదని ఆయన పేర్కొన్నారు. పార్లమెంట్ లో బి సి బిల్లు పెట్టి అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికలలో 50 శాతం రిజర్వేషన్లు పెట్టాలి. కేంద్రం లో బి.సి లకు ప్రతేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసి 2 లక్షల కోట్లతో ప్రతేక అభివృద్ధి పథకం ప్రకటించాలి. బి సి ల విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లను 25 శాతం నుంచి 50 శాతం పెంచాలి. బి సి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి. ఈ మేరకు రాజ్యాంగాన్ని సవరించాలి. బి.సి ల విద్య- ఉద్యోగ రిజర్వేషన్లు పై యున్న క్రిమిలేయర్ ను తొలగించాలి. బి.సి లకు పారిశ్రామిక పాలసీ లో 50 శాతం కోటా ఇవ్వాలి. హై కోర్టు -"సుప్రీంకోర్టు జడ్జిల నియమాకంలో ాఅ/ాు/ఃఅ- రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలి. ప్రైవేటు రంగం లో ాఅ/ాు/ఃఅ లకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలి. కేంద్రంలో ఖాళీగా యున్న 16 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని కోరారు.

అరెకటికలకు కార్పోరేషన్ ఏర్పాటు చేయాలి

1. ప్రభుత్వం వెంటనే 500 కోట్ల రూపాయలతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ జ.వో తేవాలి. 2. ప్రభుత్వం బిసి డి నుండి బిసిఏ హోదా కల్పిస్తూ జీవో తేవాలి. 3. ప్రభుత్వం వైన్స్ టెండర్లలో 30% రిజర్వేషన్ కల్పిస్తూ జీవో తేవాలి. 4. ప్రభుత్వం మేకల, గొర్ల అంగల్లలో మండీలలో తై బజార్ విధానాన్ని రద్దు చేస్తూ జ.వో తేవాలి. 5. ప్రభుత్వం గోర్ల మేకలు తీసుకురానికి పోతున్న ఆరెకటికలకు యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ 25 లక్షలు ఇవ్వాలి. 6. ప్రభుత్వం వీడిసి విధానం రద్దు చేస్తూ సీవో తేవాలి. 7. మేకల మండిలను ఆధునికరించి, ఇంటిగ్రేటెడ్ మటన్ మార్కెట్లను రెకటికలకు అప్పగిస్తూ ప్రత్యేక జీవ తేవాలి. 8. ప్రభుత్వం ఆరె కటికల మటన్ షాపులకు ఉచిత కరెంటు ఇవ్వాలి. జీవో తేవాలిఈ కార్యక్రమం లో ఎమ్మెల్సీ కోదండరాం బీసీ కమిషన్ చైర్మెన్ నిరంజన్, డిప్యూటీ మేయర్ సుభాష్ చంద్ర జి. దొడ్డి కొమరయ్య సినిమా డైరెక్టర్ సేనాపతి, సర్పంచులు డిప్యూటీ సర్పంచులు వార్డు మెంబర్ లు మరియు పోటీ చేసిన రాష్ట్ర అధ్యక్షులు గబ్బిస్కర్ భూంపల్లి అశోక్ దాదా. జనరల్ సెక్రెటరీ కె నాగేశ్వర్. ఉపాధ్యక్షులు ఎం.నాగ శేషు, కే వెంకటేష్ జి, కె శ్రీనివాస్. కే ఎన్ శ్రీనివాస్. పాలెం రమేష్ జి. ట్రెజరర్ కేడి దినేష్. జాయింట్ సెక్రెటరీ జి శ్రీనివాస్. జె నరేష్. మహేందర్ కి. తుల్జా రామ్. ఆర్గనైజింగ్ సెక్రటరీ బాలరాజు, జాంగిర్, ఏ పవన్, కే వనజ బాయ్, ఎస్ సరస్వతి బాయ్, సంతోష్, పవన్, చింటూ, ఐటి గోపాల్ జి తదితరులు పాల్గొన్నారు.

